నడిపించే నాన్న

ఓర్పుకు మారు పేరు. మార్పుకు మార్గదర్శి. ప్రగతికి సోపానం నాన్న. ప్రతి విజయంలోను వెన్నంటి వుంటూ... బాధలోనైనా నేనున్నానంటూ ఆసరా ఇచ్చే శక్తి నాన్న. అలాంటి నాన్న గురించి బాలీవుడ్ తారల... మనసు పొరల్లోంచి వచ్చిన మాటలు...

దీపికా పదుకొనే
తండ్రి : ప్రకాష్ పదుకొనే

నాన్న చాలా అణకువగా వుంటూ... అందరితో కలిసిపోయే మనస్తత్వం కలవారు. ఇంట్లో నేను, మా చెల్లెలు అందరి పిల్లల్లానే పెరిగినా బయట మాత్రం మమ్మల్ని భిన్నంగా చూసేవారు. జయాపజయాలు ఎదురైనప్పుడు ఎలా మెలగాలో నాన్న మాకు నేర్పారు. అందుకే సినిమా విజయం సాధించినప్పుడు పొంగిపోను...పరాజయం పాలైనప్పుడు కుంగిపోను.

విద్యా బాలన్
తండ్రి: పి.ఆర్. బాలన్

నాన్న నాకు గొప్ప స్ఫూర్తి ప్రదాత. నన్ను నడిపించే శక్తి కూడా ఆయనే. 'కావాలంటే నువ్వు ఎప్పుడైనా నటివి కావొచ్చు. కానీ కాలేజీకి వెళ్లి చదువుకోలేవు కదా' అనేవారు. అందుకే నేను ముందు చదువు పూర్తి చేశాను. తర్వాతే నాకు ఇష్టమైన పని చేపట్టాను.

సోనాక్షి సిన్హా
తండ్రి: శత్రుఘ్న సిన్హా

నేను ఏది చేసినా మంచి పనే అనుకుంటారు నాన్న. ఆయన గొప్ప మార్గదర్శి. ఎదుటి వారికి సాయం చేయడంలోను, ప్రతి ఒక్కరితోను సత్సంబంధాలు కొనసాగించడంలోను ఆయనకు ఆయనే సాటి. అందరితో కలిసిపోయే స్వభావం నాకు ఆయన నుంచే వచ్చింది. ఆయన నాకు ప్రతి విషయంలోను మద్దతునిచ్చారు. అయితే నాకోసం పని చేయమని ఆయన ఎవ్వరినీ అడగలేదు. అలా జరిగిపోయిందంతే.

కరీనా కపూర్
తండ్రి: రణధీర్ కపూర్

నన్నిలా మలిచింది నాన్న, తాతయ్యే. వ్యక్తిగా నాన్న చాలా గొప్ప మనిషి. ఆయన హాస్యోక్తుల్లో ఎంతో వుంటుంది. ఆయనతో కూర్చుంటే సమయమే తెలీదు. అంత ఆనందంగా గడిచిపోతుంది. ఎప్పడూ నవ్వుతూనే వుంటారు. అన్నింటికీ మించి నాకు మంచి స్నేహితుడు. తనతో కలిసి వెండితెరమీద కనిపించాలని ఆశ.

బిపాషా బసు
తండ్రి: హిరక్ బసు

నాన్నకు నేను ఎంచు కున్న ప్రతి అంశం మీద నమ్మకం వుండేది. ప్రతి మహిళకు నాన్న లాంటి పురుషుడు లభించాలని కోరుకుంటున్నా. అమ్మ ఫొటోలు తీసి కంప్యూటర్ స్క్రీన్ సేవర్‌గా పెడుతుంటారు. ఎంత అందం గా వుంటాయో ఆ ఫొటోలు! నా మీద అంత ఆసక్తి చూపించే వ్యక్తిని పెళ్లాడాలని ఆశ.

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

బుడి బడి అడుగులు

ఆ చిన్ని అమాయకపు కళ్లల్లో... సెలవులు అయిపోయాయన్న దిగులు... బడి మొదలైందన్న గుబులు. ఇంకో నాలుగు రోజులు ఇంట్లోనే వుండాలని వగలు. నిన్న మొన్నటి వరకు ఆటలు పాటలు. కథలు కార్టూన్లు. అలకలు అమ్మ చేతి ముద్దలు. అమ్మమ్మ తాతయ్యల అలనాటి ముచ్చట్లు. చల్లని పల్లె పలకరింపులు. పాఠాలు మార్కుల ఒత్తిళ్లు లేని కమ్మటి రోజులు. చూస్తుండగానే రెండు నెలలు చల్లగా కరిగిపోయాయి హిమక్రీములా. బడి గంట మోగడంతో పరుగులు మొదలయ్యాయి అయిష్టంగా.

× × ×

ఇక మళ్లీ ర్యాంకుల చుట్టూనే పరుగులు. మూటెడు పుస్తకాల బరువు, అన్నం బాక్సుతో ఆరంభం. పాఠాలు అర్థమైనా కాకున్నా, ఇష్టమున్నా లేకున్నా తరగతి గదిలోనే హాజరు వేయించుకోవాలి. ఆకలేసినా వేయకున్నా వేళ ప్రకారం చద్ది డబ్బా ఖాళీ చేయాలి. లేకపోతే స్కూల్లో టీచర్లు, ఇంట్లో తల్లులకు కోపం రాదూ! కాళ్లు పీకుతున్నా మనసు లాగుతున్నా బెంచీలకే అతుక్కోవాలి. బైటికిపోయి ఆడుకోకూడదు. మెదడు నిండా కూరే ఎక్స్‌ట్రా ఎక్స్‌ట్రా జ్ఞానంతో చిన్నారుల సహజసిద్ధమైన చలాకీతనం ఎటు ఎగిరిపోతుందో! ఎవరు మాత్రం చెప్పగలరు! ఎలా తీసుకురాగలరు?

× × ×

సరే ఇవన్నీ కార్పొరేట్ బళ్లల్లో కష్టాలు. మరోలా భయపెడుతుంది ప్రభుత్వ పాఠశాల తీరు. సూర్యచంద్రులు చలి-చినుకులతో ఇక్కడి చిన్నారులకు సాన్నిహిత్యం ఎక్కువ. ఇంత వరకు ఉచిత పుస్తకాలు అందింది లేదు. స్వచ్ఛ భారత్ చెవిలో రొదపెడుతున్నా- విద్యా బాలన్ యాడ్ రోజూ చూస్తున్నా ఈ బళ్లలో మంచినీళ్లు-మరుగు మాటే వుండదు. పంతుళ్ల జాడే కానరాదు. అయినా సరే అభిమన్యులై పోరాడాలి. పంచనక్షత్రాల 'కార్పొరేట్' పిల్లలతో పోటీ పడి గెలవాలి. ఎందుకంటే ఏ బడైనా అమ్మానాన్నల ఆశలు మాత్రం ఒకటే. శక్తికి మించి పరుగులు తీసైనా సరే ర్యాంకులు కొట్టాలి. లేదంటే తాము ఒత్తిడికి గురైంది కాక చిన్నారులనూ ఒత్తిడి పెట్టేస్తారు. చివరాఖరికి ఇది ఎవ్వరికీ మంచి చేయదు.

× × ×

చిన్నారులు ఆడుతూ పాడుతూ వచ్చేలా బళ్లు, వూరికే ఒత్తిళ్లు పెట్టని ఇళ్లు, హాయిగా సాగే చదువులుంటే ఎంత బాగుండు! అప్పుడైతే అలవోకగా ఐన్‌స్టీన్లు, మేరీ క్యూరీలు ఇంటికొకరు పుట్టుకు రారూ!?

■

◆ మనలో మాట

టపా

పాత తరం గొప్ప నటి

పాత తరం నటుల్లో వరలక్ష్మి ఒకరు. తెలుగు, తమిళ చిత్రాలలో ఆమె నటి, అగ్రశ్రేణి గాయని కూడా. పౌరాణిక, జానపద చిత్రాలు ముందు పీఠికలో ఉన్నాయి. ఆనాటి నటులు కొన్ని నిబంధనలు పాటించేవారు. డబ్బు కోసం అన్నీ పాత్రలు నటించేవారు కాదు.ఆమె జీవితంలో ఎన్నో వైఫల్యాలు చవిచూసింది. సినిమా జీవితం లో చాలా వరకు కష్టాలు అనుభవించినవారే.

టి.శ్రీరామ మూర్తి, గాజువాక, విశాఖపట్నం.

అన్నీ బాగున్నాయి

సాయంత్రం 7 గంటల తరువాత చీకట్లో నడిచి వెళతుంటే కొంచెం దృష్టిగల వారికి దారి స్పష్టంగా కనిపిస్తుంది. ఆ చీకట్లో మిణుగురు పురుగులు మరికొన్ని కీటకాలు కూడా వెలుతురునిస్తాయి. క్వీన్‌ల్యాండ్ దేశస్తులు వీటిని ప్రదర్శించారు. ప్రతి మనిషికి దైవభక్తి ఉంటుంది. వారి వారి దైవాలను వారు ఎక్కడ నివశిస్తే అక్కడ ప్రతిష్టించుకుంటారు. సినీ వినీలాకాశంలో ఒక వెలుగు వెలిగిన తార ఎస్.వరలక్ష్మి. ఏ పాత్ర వేసినా చాలా అందంగా ఉండేది. ఒక్కో మనిషికి ఒక్కో రకమైన తత్వం ఉంటుంది. ప్రతి మనిషికి కోపం ఉంటుంది. కొన్ని రంగాలల్లో కోపాన్ని బహిర్గతం చేసి ప్రచారం చేస్తారు. యాత్రల్లో ఎన్నో రకాల యాత్రలు చూసినా రిక్షా యాత్ర చాలా ఆశ్చర్యంగా ఉంది. హిమాలయ ప్రాంతంలో రిక్షాతో యాత్ర చేయడం నిజంగా గర్వించదగ్గ విషయం. కొన్ని ప్రాంతాల్లో బహుభార్యత్వం సర్వసాధారణం. ఎన్నికలప్పుడు ప్రజలు నాయకుల ను గట్టిగా నిలదీయాలి. స్త్రీలకు అన్నింటి లో అన్యాయమే జరుగుతుంది. మాయ వాగ్దానాలు చేసేవారు ఎన్నికైన తరువాత వారి నిజ స్వరూపం తెలుస్తుంది.

బొడ్డేపల్లి కనకలక్ష్మి, ఆముదాలవలస.

బానిస బతుకులా?

ఆస్ట్రేలియా క్వీన్‌ల్యాండ్‌లో హిందూ దేవాలయ వైభవం, టూంబోరిన్ కొండ గుహల్లో మిణుగురు పురుగులు ప్రసరిస్తున్న వింత కాంతులు ఆశ్చర్య పరిచాయి. తీవ్రమైన నరాల బలహీనత వ్యాధితో పోరాడుతూ మరోపక్క పరుగు పందెంలో పాల్గొంటూ జాతీయ స్థాయిలో రికార్డు సృష్టించిన కెయిలా క్రీడాస్ఫూర్తి వర్ధమాన క్రీడాకారులకి ఆదర్శనీయం. అడవులు, కొండలు, లోయలు, కఠోరమైన రహదారుల గుండా కేవలం రిక్షానే ఆధారం చేసుకొని 68 రోజుల్లో 3000 కిలోమీటర్లు ఒంటరి ప్రయాణం సాగించిన సత్యేన్ దాస్ నిజంగా ధీరోధాత్తుడు. కేరళ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే గజరాజు అద్దె 4.5 లక్షల రూపాయలు పలకడం వాటి వైభోగానికి నిదర్శనం. మహారాష్ట్రలో డెంగన్మాల్ అనే గ్రామంలో నేటికీ బహుభార్యత్వం, బానిస బతుకులు సాగుతున్నా ప్రభుత్వాలు, ప్రజలు, సంఘసంస్కర్తలు నోళ్ళు మెదపకపోవడం మన సమాజం చేసుకున్న దౌర్భాగ్యం.

టి. సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం

సముద్ర రాణి చాలా బాగుంది

పురాతన కట్టడాలు, కేరళ అందాలు, సముద్రపు అందాలు, కళలు ప్రార్థన మందిరాలు ఇంకా చూడవలసిన ప్రదేశాలు గురించి ఎంతో విపులంగా వివరించారు. ఇంకా మరిన్ని ప్రదేశాలు గురించి ఆసక్తిగా ఎదురుచుస్తున్నాం.

దేవ ప్రియం, జంగారెడ్డిగూడెం, ప.గో.జిల్లా (ఈ-మెయిల్)

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1, ఆజమాబాద్, హైదరాబాద్-500020.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

అద్దాల్లో సంద్రం

కవర్ స్టోరీ — 14

గౌరామి మీనాల ప్రేమ సన్నివేశాలు. డిస్కస్ చేపల హోళీ ఈదులాటలు. భారీ జలలోకపు వాసుల పలకరింపులు. ఎంత ఇంపుగా ఉంటాయి మనసుకు. సంద్రాన్ని కట్టిపడేసిన గాజు ఫలకాల మధ్య కాలిబాటల్లో మన విహారాలు. మునక వేయకుండానే జలచరాలతో సాగే మన ముద్దు ముచ్చట్లు. ఎంత గమ్మత్తుగా ఉంటుంది ఆ సందర్శన. నదీమ తల్లుల అబ్బురాల్ని, సముద్రగర్భ అద్భుతాల్ని కడుపున పెట్టుకుని చూపిస్తాయి ఆక్వేరియాలు. ఉగ్గబట్టుకోలేక కేరింతలు కొట్టే పెద్దల్ని.. చిన్నారు ల్ని చేసే మాయా లోకమది. మత్తు నిద్రలో పొర్లాడే చిన్నారుల కలల ప్రపంచాన్ని గాజు అద్దాల్లో నిలిపిన మత్స్య యంత్రమది.

అంగడి 3
బొమ్మకి అచ్చులు

నవ్వుల్ పువ్వుల్ 4

విభిన్నం 5
మరగుజ్జులు అంగట్లోకి...!

సినిమా కబుర్లు 6
అగ్రతారలకు అమ్మ

వింత లోకం 8
తాబేలుతో దోస్తీ

స్ఫూర్తి 9
ఆఫ్ఘన్ బతుకు బండి

స్టార్ 10
కోప్పడితే ఏడ్చేస్తానన్నా...

ప్రత్యేకం 11
ఎగిరే జైలు పక్షులు

కథ 18
అంకుశం

రుచి 21
మది దోచే మష్రూమ్స్

బాలనేస్తాలు 22
జెరొబా

కొత్త పుస్తకాలు 24
చిత్రకారులకు విందు భోజనం

ఎడారిలో రంగుల నగరాలు 12

బొమ్మకి అచ్చులు

బార్బీ బొమ్మకు కెన్ అనే బోయ్ ఫ్రెండ్ బొమ్మ ఉందని తెలుసో లేదో. బార్బీకి ఎంత క్రేజ్ ఉందో కెన్‌కు కూడా అంతే క్రేజ్ ఉంది విదేశీ టీనేజర్లలో. కెన్‌కు అచ్చుపోసినట్టు బాయ్‌ఫ్రెండ్ కావాలని కలలు కంటున్నారు. కెన్‌కు ప్రాణం లేదని బిక్కమొహాలు వేసే వారిని ఆకట్టుకునేందుకు కొందరు కుర్రాళ్లు బొమ్మలా మారిపోతున్నారు. ప్లాస్టిక్ సర్జరీల ద్వారా కృత్రిమంగా హ్యూమన్ కెన్‌లుగా తయారవుతున్నారు. కోరి కష్టాలను తెచ్చుకుంటున్నారు.

మారిషియో గాల్డి

రోడ్రిగో ఆల్వ్స్

అమెరికా, బ్రెజిల్, జపాన్, బ్రిటన్ ఇలా చాలా దేశాల్లో సెలబ్రెటీలుగా వెలిగిపోతున్న వీరంతా చాలా చిన్న వయసులోనే శరీరాకృతి మార్పుకు కత్తి గాట్లు పెట్టించుకుంటున్నారు. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తమ శరీరాన్ని అచ్చు బొమ్మలా మార్చుకునేందుకు ప్లాస్టిక్ సర్జరీలతో పాటు పెక్స్ అనే ఇంప్లాంట్స్ పెట్టుకుని ఛాతీ, కండరాల ఆకృతి మార్చుకునే వరకు వెళ్లారు. విమర్శలు వెల్లువెత్తుతున్నా, ఓ పక్క వీరితో రియాలిటీ షోలను నిర్వహిస్తూ భారీగా క్రేజ్‌ను సొమ్ము చేసుకుంటున్నారు. లండన్‌కు చెందిన రోడ్రిగో ఆల్వ్స్ శరీర ఆకృతి మార్చుకునేందుకు ఇప్పటి వరకు 30 ఆపరేషన్లు చేయించుకున్నాడు. ముక్కు నుంచి మొదలైన ఇతగాడి మార్పు శరీరం మొత్తాన్ని చుట్టేసింది. నాలుగు రైనోప్లాస్టీలు, రెండు లైపోసక్షన్లతో సంతృప్తి లేక ఛాతీ ఆకారం అచ్చు కెన్ బొమ్మను పోలి ఉండేంత వరకు ఆపరేషన్లు ఆపనని శపథం చేశాడు. ఫ్లైట్ అటెండెంట్‌గా పనిచేస్తూనే రియాల్టీ షోలలో పాల్గొంటున్నాడు. ఈ ఏడాది జనవరిలోనే ఆరు మార్పులు చేసే శస్త్రచికిత్సకు సుమారు 43 లక్షల రూపాయల వరకు ఖర్చు చేశాడు. అయినా అక్కడక్కడ వంకలు ఆయనకు కనిపిస్తున్నాయి.



సెల్సో సాంటె బేన్స్

2004లో అతనికి ఈ ఆలోచన వచ్చింది. తను కలసిన వారికన్నా తాను అందంగా లేనని, తనలో లోపాల్ని వెతకడం ప్రారంభించి ప్లాస్టిక్ సర్జరీల వెంటపడ్డాడు. ఇప్పటికీ కోటిన్నర వరకు ఖర్చు చేశాడు. అక్కడి వైద్యులు సర్జరీకి నిరాకరిస్తున్నారని వేరే దేశాలకు వెళ్లి ఆకృతిని మార్పు చేయించు కుంటున్నాడు. కెన్ బొమ్మలో ప్రత్యేకంగా కానవచ్చే 'సోల్‌లెస్ గేజ్' ఆత్మ లేని చూపు కోసం కంటికి కూడా ఆపరేషన్ చేయించుకున్నాడు. హ్యూమన్ బార్బీ వలెరియా లూక్యానోవా, హ్యూమన్ కెన్ జస్టిన్ జెడిలికాకు సమాన గుర్తింపు కోసం తెగ ఆరాటపడుతున్నాడు. జెడిలికా అయితే ఏకంగా 190 ఆపరేషన్లు చేయించుకున్నాడు. బ్రెజిల్‌కు చెందిన టీనేజర్ మారిషియో గాల్డిది ఇదే ఆరాటం. 27 ఏళ్ల మారిషియో దీని కోసం ఇప్పటికే కోటి రూపాయల వరకు వదిలించుకున్నాడు. 17 ఏళ్లు ఉన్నప్పుడు నుంచి ప్లాస్టిక్ సర్జరీలు చేయించుకోవడం మొదలెట్టాడు. బార్బీ బీచ్ క్రూయిజర్ అంటే పడిచచ్చిపోయే మారిషియోకి బొమ్మలంటే ప్రాణమట. కానీ ఆడపిల్లలా తాను ఆడుకుంటే ఏమనుకుంటారో అని తానే బొమ్మలా మారిపోవాలని నిర్ణయించుకున్నాడు. నటుడుగా ఎదగాలని శిక్షణ తీసుకునే సందర్భంలో ఈ పిచ్చి మరీ ఎక్కువై సర్జరీకి గాటు పెట్టించింది. ఇతనికి అదే దేశంలో పోటీగా ఉన్న మరో బొమ్మ మనిషి సెల్సో సాంటెబేన్స్ 21 ఏళ్లకే లుకేమియాతో చనిపోయాడు. ఇలా ఒకరిని చూసి మరొకరు బొమ్మల్లా మారిపోవాలని అనుకోవడానికి మీడియా హైప్ కూడా ఒకటి. టీనేజర్ల అటెన్షన్ ఎక్కువ. ఒకసారి ఈ పిచ్చి పడితే అంత త్వరగా బయటపడలేమని రోడ్రిగోనే బాధపడ్డాడు. బాడీ డిస్మార్ఫిక్ డిజార్డర్ అనే మానసిక సమస్యే ఈ అతికి కారణమని వైద్యులు చెబుతున్నారు. తమ శరీరాకృతిలో లేనివి, చిన్నవి అయిన లోటు పాట్లను ఎక్కువగా ఊహించుకుని ఈ స్థాయికి వెళ్లిపోతారని అంటున్నారు. యుక్త వయస్సులోనే ఈ లక్షణాలు ఎక్కువ. మానసిక దాడులకు, వెక్కిరింతలకు గురైన వారిలో దీని బీజం త్వరగా పడుతుంది. శరీరాకృతిలో 'మిస్టర్ అండ్ మిస్ పర్‌ఫెక్ట్' అవ్వాలనే వీరి కాంక్ష వికటించి ప్రాణాల మీదకు తెస్తుంది. చదువుల్లోను, సామాజికంగాను, వృత్తిలోను వెనుకబడిపోతారు. నలుగురు తమ లోపాన్ని పట్టి చూస్తున్నారనే ఆత్మన్యూనత తారాస్థాయిలో చేరి ఒంటరి జీవితాలకు అలవాటు పడతారు. కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీతో వీరి సమస్యను పోగొట్టొచ్చని వైద్యులు చెబుతున్నారు. మన దగ్గర బొమ్మలా మారేంత పిచ్చి లేకున్నా, ఏమో ప్రపంచాన్ని బుల్లిది చేసి చేతికి చిక్కిస్తున్న ఈ నెట్ తరంలో.. అమెరికాలో ఎవడో చిరుగుల ప్యాంట్‌తో బయటకొస్తే, వీళ్లు ఇక్కడ నిక్కర్లను కట్ చేసుకుంటున్నారు. అసలే సెలబ్రెటీల పిచ్చీ ఎక్కువే. ✦

నవ్వుల్ – పువ్వుల్



అర్థం

జంబులింగం: ఒరేయ్ శంభూ! ఐ యామ్ గోయింగ్ అంటే ఏంటిరా?

శంభులింగం: నేను వెళ్తున్నా.

జంబులింగం: బాబ్బాబు, నీకు పుణ్యముంటది. దీనికి అన్సర్ చెప్పి వెళ్ళరా.

వేల పాత్రలు

రాము: ఈ పుస్తకాన్ని చదవలేకపోతున్నా...

లైబ్రేరియన్: ఎందుకని?

రాము: ఇందులో వేల పాత్రలున్నాయి. అస్సలు అర్థం కావట్లేదు.

లైబ్రేరియన్: ఓహో నిన్న ఫోన్ డైరక్టరీ తీసుకెళ్ళింది నువ్వేనన్న మాట!

బెదిరింపు

(సోము పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి)

సోము: సార్ నాకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయి.

ఎస్సై: ఏమని?

సోము: రీచార్జ్ చేయించుకోకపోతే కనెక్షన్ కట్ చేస్తామని.

సెలవు

బుజ్జిగాడు బేర్‌మని ఏడుస్తున్నాడు. ఎందుకు ఏడుస్తున్నావురా అడిగింది వాళ్ళ అమ్మ.

మరేమో మమ్మీ ... మా క్లాస్ టీచర్ నెల రోజుల నుంచీ జ్వరం అని రావట్లేదు... ఇప్పుడేమో... (మళ్ళీ బేర్‌మన్నాడు).

ఏమైందిరా అవిడకీ ఇంకా సీరియస్ అయిందా అడిగింది అమ్మ.

కాదు మమ్మీ రేపటి నుంచి టీచర్ మళ్ళీ వస్తుందట చెప్పాడు బబ్లూ.

దీర్ఘాయుష్మాన్ భవ

నాకు చాలాకాలంపాటు బతకాలని ఉంది డాక్టరు ఏమైనా హెల్త్ టిప్స్ చెబుతారా? అడిగాడు రాము.

"పెళ్ళి చేసుకోండి" సలహా ఇచ్చాడు డాక్టర్.

"అలాగైతే ఎక్కువ కాలం బతకుతారా? ఆశ్చర్యపోయాడు.

"అదేం లేదులే కాకపోతే అప్పుడు కాలం భారంగా గడుస్తూ ఎక్కువ కాలం బతికినట్టు అనిపిస్తుంది. అసలు సంగతి చెప్పాడు డాక్టర్.

శపథం

బ్రాందిమూర్తి: నా జీవితంలో పేకాట తాగుడు అలవాటున్న వెయ్యిమందిని ఆ అలవాట్లు మాన్పిస్తానని భీకర శపథం చేశాను.

కృష్ణమూర్తి: వెరీగుడ్. ఎంతమంది మానేశారు?

బ్రాందిమూర్తి: ఇప్పటికి 99 మంది చేత మాన్పించాను.

కృష్ణమూర్తి: ఇంకొక్కడేగా మిగిలింది. అది కూడా పూర్తి చేయలేకపోయావా?

బ్రాందిమూర్తి: అదే చూస్తున్నా. నేను కూడా మానేద్దామా, వద్దా అని.

ట్రైనింగ్

కనకరావు ఇంట్లో ఒక అర్ధరాత్రి వేళ దొంగలు పడ్డారు. ఒకరూ, ఇద్దరూ కాదు ఏకంగా 40 మంది. వాళ్లను చూడగానే తారెత్తిపోయిన **క**నకారావు ఇందేంటి ఇంత మంది దొంగలా ? అంటూ నోరు తెరిచాడు.

కంగారు పడకయ్యా వీళ్లంతా చోర శిక్షణలో ఉన్న స్టూడెంట్స్. ప్రాక్టికల్స్‌కి నీ ఇల్లు ఎంచుకున్నాం అంతే చెప్పాడు శిక్షణ ఇచ్చే ప్రొఫెసర్ గంగులు.

మన సినిమాల్లో చూస్తూ ఉంటాం బాగా పొట్టి వాళ్లతో అడ్డమైన కామెడీ చేయిస్తుంటారు. అక్కడక్కడ పెళ్లిళ్లలో మరగుజ్జులకు బొమ్మలు తొడిగి పిల్లల్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. సర్కస్ విషయం సరేసరి. ఇక్కడిలాగే మిగతా ప్రపంచం కూడాను. కానీ, స్వీడెన్‌లో డ్వార్ఫ్ రెంటల్స్‌ను ప్రారంభించిన డ్వార్ఫ్ అనే వెబ్‌సైట్‌కు గట్టిగా అడ్డుతగులుతోంది అక్కడి మానవ హక్కుల సంఘం.

మరగుజ్జులు అంగట్లోకి...!

స్వీడెన్‌లో సరదాలెక్కువ. అవి ఒక్కోసారి శృతిమించుతున్నాయి. చాలా కురచగా ఉండేవాళ్లను డ్వార్ఫ్‌లని యూరప్‌లో పిలుస్తారు. వారిని బార్‌టెండింగ్ పనిలో పెట్టుకుని పార్టీల్లో మరింత సరదా జోడించేందుకు చాలా మంది డ్వార్ఫ్ వెబ్‌సైట్‌కు దరఖాస్తులు పెట్టుకుంటున్నారు. వారిని బాడీగార్డుల పేరిట ప్రదర్శనగా తీసుకెళుతున్నారు. ఇంకా హద్దు దాటిన ఇంకొందరు వారితో బాక్సింగ్ ఆట ఆడిస్తూ పందేలు కాస్తున్నారు. ఒక్కో డ్వార్ఫ్‌కు 4000 వేల క్రోనార్లు అంటే మన కరెన్సీ ప్రకారం 32 వేల రూపాయలను వసూలు చేస్తోందా కంపెనీ. వీటికే కాకుండా 'ప్రత్యేక సేవల' పేరిట వారితో అర్థం లేని పనులు చేయించుకునేందుకు వారిని గంటకు 8 వేల రూపాయలకు బేరం పెట్టింది. నైట్ క్లబ్బుల నుండి బ్యాచిలర్ పార్టీల వరకూ ప్రతి పార్టీకి పంపేందుకు సిద్ధమైంది. ఆ వృత్తిలో ఎటువంటి అపాయాలుంటాయో తెలీని మరగుజ్జులు ఆ పార్టీల్లో అభాసుపాల వుతున్నారు. ఒక్కోసారి గాయాలపాలై ప్రాణాల మీదకే తెచ్చుకుంటున్నారు. వారిని పైకి ఎగరేస్తూ విపరీత ఆనందాన్ని పొందేందుకు డ్వార్ఫ్ టాసింగ్ అనే ఆటనే రూపొందించారు. అది వివాదాస్పదమ వడంతో దాన్ని నిలిపివేసింది ఆ కంపెనీ. ఎగతాళి, అవహేళనలకు అడ్డేలేదు. కొన్ని పార్టీల్లో జెండా కర్రకు ఎగబాకి పతాకంలా ఒడిసిపట్టుకోమంటున్నారట.

ఈ వెబ్‌సైట్ నిర్వాహకుడు 28 ఏళ్ల ఎరిక్‌సన్. డెన్మార్క్‌లోనే ఇదే తరహా వృత్తిని నిర్వహిస్తున్న మరగుజ్జు ఆరష్ అయాతి నెజాద్‌ను చూసే ఈ వ్యాపారం ప్రారంభించాడని చెప్పుకుంటాడు. ఈ వ్యాపారం ద్వారా తనతో పాటు మరగుజ్జులకు మేలు కలుగుతోందని వాదిస్తున్నాడు. మంచి ఆదాయం అందివ్వడం తప్పా అని ఎదురు ప్రశ్నిస్తున్నాడు. ప్రస్తుతానికి 10 మందిని విధుల్లోకి తీసుకున్నాడు. ఇలాంటి తిక్క పార్టీలను ఎక్కువగా బడాబాబుల ఇళ్లలోనే చోటు చేసుకుంటున్నాయి. వారి ఏం చేసినా నోరెత్తలేకపోతున్నారు కొందరు మరగుజ్జులు. ఏదో డబ్బు వస్తుందని ఆశపడ్డామే గానీ, మరీ ఇంత బాధ పడాల్సి వస్తుందని ఊహించలేదని ఇప్పుడు లబోదిబోమంటున్నారు. ఈ పార్టీలు ఎక్కువైపోవడంతో విషయం మీడియా దృష్టికి వెళ్లింది. దీనిపై కథనాలు వెల్లువెత్తాయి. ఈ విషయం ఆ నోట ఈ నోట పాకి మానవ హక్కుల సంఘాలకు చేరింది. ఈ వెబ్‌సైట్‌ను దుయ్యబడుతూ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరాయి. స్వీడిష్ నేషనల్ అసోసియేషన్ ఫర్ డిసేబుల్డ్ చిల్డ్రన్ అండ్ యంగ్ పీపుల్ సంస్థ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టింది. వృత్తి అనేది అవమానకరంగా ఉండకూడదనేది వారి వాదన. అందరిలా సాధారణ జీవితానికి అనుగుణంగా మరగుజ్జులకు అవకా శాలు కల్పించాలి గానీ, ఈ పిచ్చి పనేంటని నిలదీ స్తోంది. భిన్నంగా ఉన్న వారిని ప్రదర్శనగా చేసి వ్యాపారం చేయడం చరిత్రలోనే హేయమైన చర్యగా దీన్ని చెబుతూ వెబ్‌సైట్ మూతబడే దాకా వదలబోమని ఉద్యమం మొదలెట్టింది. ఇటువంటి వ్యాపారాల వల్ల మరింత మంది భిన్న రూపాలున్నవారిని, అరుదైన వ్యాధులతో ఉన్న వారినీ అంగడి సరుకుగా ప్రదర్శిస్తారని, దీన్ని వదిలే ప్రశక్తే లేదని అంటు న్నాయి అక్కడి మానవ హక్కుల సంఘాలు. భావి తరాలకు చెడు సంకేతాలు పోతాయని అవి గొంతు పెద్దవి చేశాయి. కొందరి వెకిలి పార్టీల వల్ల మిగతా వారి మీద ప్రభావం బలీయంగా పడుతుందని, ఆ వృత్తిలో ఉన్న మరగుజ్జులు బయటపడాల్సిందిగా నచ్చ జెబుతున్నాయి. ✦

అగ్రతారలకు అమ్మ

కడప జిల్లా ప్రొద్దుటూరు. వెల్లాల శ్రీనివాసరావు, పెద్ద నరసమ్మ దంపతుల గారాల పట్టి సుబ్బమ్మ (మే, 17,1920). శ్రీనివాసరావు రంగస్థల నటుడు. పెద నరసమ్మ సంగీతంలో నిష్ణాతురాలు. ఆ ఇంట్లో పూజలూ, నోములూ, వ్రతాలూ పాటల పల్లకిలోనే కొనసాగేవి. సంగీతాన్ని అంతగా ప్రేమించే కుటుంబం అది. ఆ కుటుంబంలో పుట్టిన సుబ్బమ్మ (శాంతకుమారి)కి సంగీతం పట్ల మక్కువ పెరిగింది. కూనిరాగాలతో పెరిగిన సుబ్బమ్మ ... కచేరీల స్థాయికి ఎదిగింది. శాంతకుమారిని చూసిన పెద్దలు 'కోకిల స్వరం, మృదువైన గొంతు. మంచి గురువుగారి దగ్గర చేర్పిస్తే గొప్ప సంగీత విద్వాంసురాలవుతుంది' అని జోస్యం పలికారు. శ్రీనివాసరావు కూతుర్ని చెన్నపట్నం తీసుకెళ్ళి ప్రొ॥ పి.సాంబశివరావు దగ్గర చేర్పించారు. వయొలిన్, వోకల్ వాయులీన విద్య. గాత్రం నేర్చుకున్నారు. ఆ సమయంలో శాంతకుమారి సహాధ్యాయిగా డి.కె.పట్టమ్మాళ్ కూడా సంగీతం నేర్చుకుంటుండేది. అభ్యాసం ఇద్దరి మధ్య పోటాపోటీగా సాగేది. పట్టమ్మాళ్ స్వర ప్రధానమైన అంశాల్లో ముందుంటే శాంతకుమారి గాత్ర ప్రధానమెన భావయుక్తమైన ఉచ్ఛారణలో ముందుండేది. ఆ సమయంలో చెన్నై విద్యోదయ స్కూల్లో నెలకు రెండు రూపాయల జీతానికి శాంతకుమారి పనిచేసింది. సమ వయస్కుడైన రాజేశ్వరరావుగారితో తరచూ చెన్నై ఆకాశవాణి కేంద్రంలో లలిత గీతాలు..సంగీత రూపకాల్లో పాలుపంచుకునేది. ఆ రోజుల్లో బాల సరస్వతి, రాజేశ్వరరావు యుగళ గీతమంటే శ్రోతలు చెవి కోసుకునేవారు. అటువంటి సమయంలో రాజేశ్వరరావుగారితో యుగళ గీతం పాడి శహభాష్ అనిపించుకుంది.

పి.పుల్లయ్య అభిరుచిగల నిర్మాత, దర్శకుడు. శశిరేఖా పరిణయం చిత్రంలో శశిరేఖగా నటించిన శాంతకుమారిని చూసి ముగ్ధుడయ్యాడు. అదే సంవత్సరంలో సారంగధర (మొదటి ఘట్టం) చిత్రంలో "చిత్రాంగి" పాత్రకు జీవం పోసింది. శాంతకుమారి అందం, సంభాషణలు పలికే తీరు, మధురంగా పాటలు పాడే వైనం చూసి నా జీవితంలో అర్ధాంగివి కాగలవా? అని అడిగాడు. శాంతకుమారి ఆలోచనలో పడింది. నేను సినిమాల్లో వున్నా సినిమా మనిషిని కాను. మానవ సంబంధాల విలువలు నాకు బాగా తెలుసు. కడవరకు నిన్ను నా అర్ధాంగిగా కాపాడుకుంటాను.. అని వాగ్దానం చేశాడు. శాంతకుమారి ఒప్పుకుంది. అదే సంవత్సరంలో పుల్లయ్యగారితో పెళ్ళి జరిగిపోయింది.

మిక్కీ మౌజ్ కాపురం

పుల్లయ్య శాంతకుమారిల దాంపత్యం మూడు సిసింద్రీలూ ఆరు తారాజువ్వల్లా సాగింది. పుల్లయ్య గారు భోళా శంకరుడు. మంచి చదువరి గాని ఇట్టే కరిగిపోయే తత్త్వం. శాంతకుమారికి చదువు లేకపోయినా లోతుగా ఆలోచించేది. ఎప్పుడూ ఇంట్లో పోట్లాటే సిసింద్రీల్లా పోట్లాడుకుని తారాజువ్వల్లా తారాస్థాయికి చేరి చివరికి వెన్న ముద్దల్లా కరిగి పోయేవారు.ప్రతి చిన్న విషయానికీ గొడవ పడేవారు. వారి గొడవ తాటాకు మంటాలా గప్పుమంటూ ఎగిసి చప్పున చల్లారిపోయేది. చివరికి నవ్వులు పూయించేది. ఒకరంటే ఒకరికి ప్రాణం అదీ వారి జీవితం. ఆ ఇల్లు ప్రేమ వాత్సల్యాలకు పెట్టింది పేరు. ఎన్.టి.ఆర్, ఎ.యన్.ఆర్‌లను స్వంత బిడ్డల్లా చూసుకునేవారు. అక్కినేనిని అబ్బీ అని పిలిచేది శాంతకుమారి. సావిత్రమ్మను తన కూతురిలా చూసుకొనేది. సినిమా వేరు అనుబంధాలు వేరు. హీరోయిన్లు ఎవరింటికొచ్చినా పసుపు కుంకుమ, పట్టుచీర తప్పనిసరి.

సినిమా ప్రహసనం

పెద్దమ్మాయి పద్మ పుట్టిన తరువాత పద్మశ్రీ బ్యానరు స్థాపించి సినిమాలు తీయడం మొదలు పెట్టారు. అక్కినేనితో 'జయభేరి' తీశారు. ఆ చిత్రం

సంగీత ప్రధానమైన, విజయవంతమైన చిత్రంగా చెప్పుకోవచ్చు. పెండ్యాల సమకూర్చిన స్వరాలన్నీ ఆణిముత్యాలే. మచ్చుకి "రసికరాజా- తగువారము కామా" పాట ఇప్పటికీ సంగీత పోటీలు ఎక్కడ జరిగినా ప్రధానంగా చోటు చేసుకుంటుంది. రెండవ చిత్రం వేంకటేశ్వర మహత్యం. ఈ సినిమా నిర్మాణమంతా కష్టాలమయం. ఈ సినిమాకి మాటలు పాటలూ ఆత్రేయే, ఆత్రేయకీ పుల్లయ్య గారికీ మంచి వేవ్‌లెంత్ కుదిరింది. పుల్లయ్య గారి మనసులో ఏముందో అదే రాస్తాడు ఆత్రేయ. అందుకే 'నా ఆత్మను ఆవిష్కరిస్తాడు ఆత్రేయ' అంటూ కితాబు ఇచ్చాడు పుల్లయ్య. సన్నివేశ రూపకల్పనలో ఆత్రేయ నూతనత్వం ఆపాదించేవాడు. అప్పటి వరకు పౌరాణిక చిత్రాలంటే దీర్ఘ సమాసాలతో కొనసాగిన సంభాషణలు క్లుప్తంగా సూటిగా ప్రేక్షకులకు కనెక్టు అయ్యేలా రాశాడు ఆత్రేయ. పుల్లయ్య-శాంతకుమారిల గారాల పట్టి సావిత్రమ్మ, పద్మావతిగా ప్రాణ పతిష్ఠ చేసింది. వకుళాదేవిగా శాంతకుమారి జీవించిందనే చెప్పవచ్చు. వేంకటేశ్వర స్వామికి తల్లి పాత్ర చెయ్యడమంటే మాటలా! ఆ సినిమా విడుదలకు అన్నీ కష్టాలే! చివరిగా విడుదలయి సంచలన విజయం సాధించింది. ఈ చిత్రంలో ఘంటసాల మాస్టారు కావాలనే అభ్యర్ధించి 'శేషశైలా వాసా శ్రీ వేంకటేశా' పాట చేయించగా ఆ పాట ఇప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోయింది.

మెచ్చు చిత్రాలు

అక్కినేని తొలి చిత్రం 'ధర్మపత్ని'లో నటించింది. "మాయాలోకం" చిత్రంలో అక్కినేనితో నటించింది. చాలా ఇబ్బందిపడింది. షావుకారు చిత్రంలో శాంతి పాత్ర. ముఖ్యంగా పద్మశ్రీ బ్యానరులో ప్రతిష్టాత్మకంగా అక్కినేని కోసం తీర్చిదిద్దిన చిత్రం "అర్ధాంగి". 'బాటసారి' చిత్రం తర్వాత అంతే కష్టసాధ్యమైన పాత్ర అక్కినేనిది. ఆయనకి అర్ధాంగి పాత్రలో సావిత్రి జీవించింది. సిరిసంపదలు స్వంత చిత్రంలో అక్కినేని తల్లిగా నటించి "చిట్టిపొట్టి పాపలూ... సిరిసిరి నవ్వుల పువ్వులు... మీరే మా సిరిసంపదలు.. వరాల ముద్దుల మూటలు" అంటూ సన్నగా హాయి గొలిపే గొంతుతో ఆలపించింది. "రాముడు -భీముడు" చిత్రంలో ఎన్.టి.ఆర్. అక్కగా నటించింది. రాజనాల ఈ చిత్రంలో శాంతకుమారి భర్త పాత్రలో నటించి చిత్రహింసలకు గురి చేస్తాడు. అమాయకుడైన రాముడ్ని ప్రాణంగా చూసుకొనే అక్క పాత్రలో పదికాలాలు గుర్తుండే నటన చేసింది. ఎన్.టి.ఆర్ స్వీయ నిర్మాత దర్శకత్వంలో వచ్చిన 'తల్లా? పెళ్ళామా?' చిత్రంలో తల్లి పాత్రలో తల్లులకూ, కోడళ్ళకీ కళ్ళు చెమర్చే విధంగా నటించింది. ఈ చిత్రంలో మనవడ్ని చూసి

"మమతలెరిగిన నా తండ్రీ.... మనసు తెలిసిన ఓ నాన్నా... నాన్నమ్మా అని వచ్చావా" అంటూ ఆర్ద్రతతో వినిపించింది. ఆమె నటననూ పదేపదే ప్రశంసించేవారు ఎన్.టి.ఆర్. ప్రేమనగర్ చిత్రంలో ఏఎన్నార్ తల్లిగా, 'కొడుకు కోడలు' స్వీయ నిర్మాణంలో అక్కినేని తల్లిగా నటించింది. ఏ చిత్రంలో నటించినా పాట పాడినా జీవం పోసేది. ఆరు పదులు దాటే వరకూ ఆమె గొంతులో మాధుర్యం తగ్గలేదు.

పుల్లయ్య గారితో...

భానుమతితో...

నవ్వులు పోయాయి- నేనూ పోతాను

పుల్లయ్యగారు బతికినంత కాలం నవ్వుతూ నవ్విస్తూనే బతికారు. ముఖ్యంగా చివరి రోజుల్లో ఒకర్ని విడిచి మరొకరు వుండలేక పోయేవారు. 'శాంతా...శాంతా' అంటూ పసిపిల్లాడు తల్లి కోసం వెదుకుతున్నట్లు కాస్సేపు కనిపించకపోతే వెదుక్కొనేవాడు. శాంతకుమారీ అంతే! పుల్లయ్య గారు బైటికెళ్లి రావడం కాస్సేపు ఆలస్యమైతే అన్ని పనులూ పక్కన పెట్టి ఆయన రాక కోసం ఎదురు చూసేది. వారిద్దరి మధ్య విడదీయరాని అనుబంధం వుండేది. కానీ కాలం పుల్లయ్యగారిని తీసుకుపోవడంతో... శాంతకుమారి ఒంటిరిదై పోయింది. రెక్కలు తెగిన పక్షిలా విలవిల్లాడి పోయింది. 'ఆయన పోయారు నవ్వులూ పోయాయి. నేను మిగిలిపోయాను'.అంటూ ఆయనతో దాంపత్య జీవితంలో మాధుర్యాన్ని తలుచుకుంటూ ఆత్మీయులతో పంచుకుంటూ నవ్వుతూ ఏడ్చేది. ఏడుస్తూ నవ్వేది. నా అల్లరి, ఆయన కాబట్టి భరించారు. ఆయన దేవుడు అంటూ చేతులు జోడించి కళ్ళు తుడుచుకునేది. 250 తెలుగు, తమిళ చిత్రాల్లో నటించిన ఆమెను చెప్పుకోదగ్గ అవార్డులేవీ వరించలేదు. ఆమె వెంపర్లాడనూ లేదు. ఇంటికొచ్చే వారిని ప్రేమగా పలకరించేది. ఎవరింటికీ వెళ్ళేదికాదు. 1988లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రఘుపతి వెంకయ్య అవార్డుతో సత్కరించింది.

ఆ తృప్తి చాలు!

అక్కినేని శాంతకుమారి ఇంట్లో బిడ్డలా మసిలేవాడు. అబ్బీ అని పిలిస్తే తృప్తిగా పలికేవాడు. ఎన్.టి.ఆర్ కూడా వేంకటేశ్వర మహత్యం చిత్రం నుంచి తల్లి లాగా పవిత్రంగా చూసుకొనేవాడు.ఇక సావిత్రి సరేసరి. పుల్లయ్య గారికి ముద్దుల కూతురు సావిత్రి. వైభవాన్ని చూశారు. పతనాన్ని చూశారు. ఆమె తనకంటే ముందు పోవడం దురదృష్టకరం అని విలవిల్లాడిపోయేవారు.'ఈ ముగ్గురు మహానటులు నన్ను తల్లిలా చూసుకున్నారు. ఇంతకు మించిన తృప్తేముంటుంది'. అంటూ అణువణువూ నింపుకున్న ఆనందంతో పులకించి పోయేది. జనవరి 16,2006 వ సంవత్సరంలో ఆమె కోరుకున్న ప్రకారం పుల్లయ్యగారి దగ్గరికే నవ్వులు వెదుక్కొంటూ పయనమయ్యింది. ఆ లోకంలో ఎన్ని నవ్వులు-పువ్వులు పూయిస్తున్నారో ఏమో!

ఇమంది రామారావు
9010133844

కొండ గృహము

వైవాహిక జీవితంలో ఒడిదొడుకులు సహజం. అది చైనా అయినా...చందోలైనా ప్రతి ఒక్కరికీ వర్తిస్తుందీ మాట. గ్జు వెనీ అనే చైనా రైతుకూ కుటుంబ కష్టాలొచ్చాయి. భార్యాభర్తలిద్దరూ విడిపోయారు. ఆ బాధ నుంచి బైట పడడానికి ఒంటరితనాన్ని కోరుకున్నాడతను. హునాన్ ప్రావిన్స్‌లోని ఓ కొండను తవ్వి నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. వంద అడుగుల లోతు, 13 అడుగుల వెడల్పు వుంటుంది. ఇంటి బయట కూడా పైన్, సిప్రస్ చెట్లతో తోట పెంచాడు. గత పదేళ్లగా తను కోరుకున్న ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జీవిస్తున్నాడు గ్జు. అయితే ఇదంతా చెప్పుకున్నంత సులభంగా అయిపోలేదు. ఆరేళ్లపాటు రేయింబగళ్లు దానికోసమే కష్టపడ్డాడు. గుహల్లో జీవించిన ఆదిమానవుడు వస్తువులను ఎక్కడ భద్ర పరచుకునేవాడో తెలీదు కానీ... ఇతను మాత్రం అల్మారాలు కూడా చెక్కాడు. వింతగా అనిపించినా ఇలా కొండలు తొలుచుకొని నివసించేవారు చైనాలో పెద్దసంఖ్యలోనే వున్నారట.

వింత లోకం

ప్రేయసి కోసం ఆడ వేషం!

ప్రేమ కోసం ఎంత వరకైనా వెళ్లే వారున్నారని ఇదిగో ఇలాంటివి జరిగినప్పుడు మరోసారి తెలుస్తుంటుంది. కజకిస్తాన్ వాసి అయాన్ సరిగ్గా అలాంటి వాడే. ఇతగాడి ప్రేయసి కాలేజీలో చేరేందుకు ఓ పరీక్ష రాయాల్సి వచ్చింది. కాకపోతే పరీక్ష అనగానే ...అమ్మడి కాళ్లూ చేతులూ వణికిపోయాయి. అతగాడు ఎంత చెప్పినా పరీక్ష రాయలేనంది. ఇక చేసేది లేక ...ఆమె కోసం తనే బయల్దేరాడు. ఆడ వేషంలో. ఆమె డ్రస్ వేసుకుని...విగ్గు తగిలించుకొని, అచ్చం అమ్మాయిలా మేకప్ వేసుకుని పరీక్ష హాల్లో కూర్చున్నాడు. అయితే నిర్వాహకులకు మొదటి నుంచీ ఏదో కాస్త తేడాగానే అనిపించింది. ఒక అమ్మాయి బదులు మరో అమ్మాయి వచ్చిందేమో అనుకున్నారు ముందర. వేసిన ఒకటి రెండు ప్రశ్నలకు సమాధానమిచ్చినప్పుడు అనుమానం మరింత బలపడింది. తను అమ్మాయి కాదని. అబ్బాయని. అంతే నిలదీస్తే గుట్టు రట్టయింది. ఇంకేముంది? అసలు అభ్యర్థికి బదులుగా వచ్చి పరీక్ష రాసినందుకు 2,000 డాలర్ల జరిమానా విధించారు. ఆ అమ్మాయి మాత్రం కాలేజీలో చేరాలంటే...చచ్చినట్టు పైఏడాది ప్రవేశ పరీక్షకు కూర్చోవాల్సిందే. ఇదిలా వుండగా... యువత దృష్టిలో అయాన్ పెద్ద హీరో అయిపోయాడు. పిచ్చి పని సంగతి పక్కన పెడితే... తమ కోసం అలా ఏం చేసేందుకైనా సిద్ధమయ్యే అబ్బాయిలు దొరికితే బావుండని అమ్మాయిలు కోరుకుంటున్నారట. ప్రేమ పిచ్చి అంటే ఇదేనేమో.

తాబేలుతో దోస్తీ

పెంపుడు జంతువు అనగానే పిల్లి, కుక్క, చేప, పావురం, కోడి... గుర్తొస్తాయి. అంతకుమించి ఆలోచించం. జపాన్‌వాసి మితాని హిసావో మాత్రం తాబేలు వైపు మొగ్గు చూపాడు. గత పందొమ్మిది సంవత్సరాలుగా దానితో దోస్తీ చేస్తున్నాడు. అనుకోకుండా ఓరోజు మితాని భార్య దృష్టి స్థానిక పెట్ స్టోర్‌లో వున్న బుల్లి తాబేలు మీద పడింది. ఏంటో తెలీదు కానీ 5 సెంటీమీటర్ల పొడవున్న ఆ బుజ్జి తాబేలు ఆమె మనసు దోచేసింది. దాన్ని ముద్దుగా 'బోన్ చాన్' అని పిల్చుకుంటారు. పందొమ్మిదేళ్లుగా కుటుంబ సభ్యురాలిగా కలిసిపోయింది. నిజం చెప్పాలంటే వారికి పిల్లలు లేని లోటు తీరుస్తోంది. తన మనసులోని మాటను ప్రతిరోజూ దానితో చెప్పుకోందే మితానికి నిద్ర పట్టదు. అలా అతని రహస్యాలన్నీ బోన్ చాన్‌కు తెలుసు. ఇద్దరూ కలిసి వ్యాహ్యాళికి వెళ్తుంటారు. వెంట ఓ చేతి సంచి తప్పక వుంటుంది. అందులో క్యారెట్లు, క్యాబేజీలు, ఓ పాలథిన్ కవరు, నీళ్ల సీసా వుంటుంది. మధ్య మధ్యలో బోన్ చాన్ తినడానికి క్యారెట్లు ఇస్తూ కబుర్లాడుతూ నడక సాగిస్తాడు. అది మార్గ మధ్యలో విసర్జించిన వ్యర్థాలను కవర్‌లోకి ఎత్తి రోడ్డు శుభ్రం చేసేస్తాడు. ఇద్దరూ వీధుల్లోకి వస్తే మాత్రం అందరి చూపూ వీరి మీదే వుంటుందని ప్రత్యేకంగా చెప్పన వసరం లేదనుకుంటా!

ఆఫ్ఘన్‌లో దుమ్ము లేచింది. అది ఇసుక తుఫానైంది. తాకింది మహిళా వివక్షను. ఆ తుఫాన్ పేరు సారా బహాయ్. ఆమెను తీక్షణంగా చూస్తే కమ్ముకున్న తుఫాన్‌లోని శక్తి కనబడుతుంది. స్త్రీ చదవడాన్నే మహాపాతుకంగా భావించే తాలిబన్ చట్టాల చట్రాన్ని విసిరికొట్టి ఆఫ్ఘనిస్తాన్‌లో తొలి క్యాబ్ డ్రైవర్‌గా ఆమె పనిచేస్తోంది. రెక్కలు తెగిన స్త్రీ స్వేచ్ఛకు చక్రాలు కట్టి బతుకు బండి వేగాన్ని పెంచింది.

ఆఫ్ఘన్ బతుకు బండి

సారా బహాయ్ సోదరి భర్తను 1990లో తాలిబన్లు అతి కిరాతకంగా హతమార్చారు. బాల్క్ ప్రావిన్స్‌లోని మజర్-ఇ-షరీఫ్‌లో ఉంటున్న ఆమెతోపాటు ఏడుగురు పిల్లలూ అనాథలయ్యారు. వారితో కలిపి బహాయ్ దత్తత తీసుకున్న ఇద్దరు యుద్ధ అనాథ బిడ్డలతో సహా మొత్తం డజను నోళ్లు ఆకలికి అల్లాడుతూ రోజుకో చావును చూస్తున్నాయి. ఉన్న ముగ్గురు కుటుంబ పెద్దలూ మహిళలే. బతుకు దెరువుకు అడుగు బయటకు వేస్తే కబళించే చూపులు, చీకొట్టే మనస్తత్వాలు. బాంబుల మోతలు, ఫత్వాల బెదిరింపులు. కొండరాయినీ వణికించే సమాజం. తెగించకపోతే ఆకలి మంటల్లో సామూహిక ఆత్మహత్య తప్పదు. తాము సరే, ముక్కుపచ్చలారని బిడ్డలకూ ఆ మరణ శిక్ష అవసరమా. అలా పసిప్రాయానే బలవ్వాల్సి వస్తే పుట్టడమెందుకు. సారా బహాయ్ ఆవేశంతో ఊగిపోతోంది. చిన్నారుల ఆకలి మూలుగులు మరింత అగ్నిని ఎగదోస్తున్నాయి. ఎర్రబారిన సారా బహాయ్ కళ్లు మృత్యువును పరుగులు పెట్టించాయి. పన్నెండు ప్రాణాలను రక్షించే మిషన్‌పై క్యాబ్ డ్రైవింగ్ పాఠాల నేర్చుకునేందుకు వెళ్లింది. క్యూ కట్టిన 30 మంది మగవారి చూపుల అసహ్యాన్ని, ఆమె విప్పార్చిన కనురెప్ప చీదరించి కొట్టింది. సారా బహాయ్... 2002లో మజర్-ఇ-షరీఫ్‌లో శిక్షణ పొంది విజయవంతంగా లైసెన్స్ వచ్చిన 10 మంది డ్రైవింగ్ విద్యార్థుల్లో ఒకరు. అసహ్యించుకున్న మిగతా 20 కళ్లు ఓడిపోయాయి. క్యాబ్ డ్రైవర్‌గా ఆమె తొలి ప్రయాణం మొదలైంది. సాటి పురుష డ్రైవర్ల సకిలింపులు, బెదిరింపులు, దౌర్జన్యాలు ఆమె రహదారికి గుంతల్లా మారాయి. నేర్పుగా, ఓర్పుగా అవన్ని దాటేసింది. ఇప్పుడామె క్యాబ్ డ్రైవర్‌గా నిలదొక్కుకుని పదేళ్లవుతోంది. పదుల మందికి డ్రైవింగ్ శిక్షణనిచ్చి మహిళల ఆర్థిక స్వాతంత్ర్యానికి పునాది వేసింది. ఆమె మొండి ధైర్యం మరికొందరు మహిళలు ద్వార బంధనాల్ని విరగ్గొట్టుకుని బయటి పడి ఉపాధి పొందేలా స్ఫూర్తినింపింది.

మహిళలు హద్దుమీరారంటూ రాళ్లతో కొట్టి చంపడాలు, ముక్కు కోసేయడాలు తాలిబన్‌ల అఘాయిత్యాల్లో సర్వసాధారణం. ఆమెకు తొలుత అలాంటి బెదిరింపులే వచ్చాయి. అయినా వెనకడుగు వేయలేదు. వేటకు ఉపయోగించే రైఫిల్ సంపాదించి రక్షణగా ఉంచుకుంది. అనుమానం వచ్చినప్పుడల్లా రాత్రుళ్లు తన ఇంటికి ఆ రైఫిల్ చేబూని పహారా కాస్తుంది. పర్వతమంత దృఢమైన బహాయ్ రూపాన్ని, హృదయాన్ని చూసుకుని ఆ ఇల్లు హాయిగా నిద్రిస్తుంది. బహాయ్ వివాహం చేసుకోలేదు. భర్తగా వచ్చేవాడు, తన సోదరి పిల్లల్ని పెంచేందుకు సహకరిస్తాడో లేడోనని. క్యాబ్ నడిపేందుకు అసలు కాలు బయటకు వేయనిస్తాడో లేదోననే సందేహం. ఆమె డిగ్రీ వరకు చదువుకుంది. తనలా చదువుల లోకానికి చేరుతున్న ఎందరో ఆఫ్ఘన్ బాలికల్ని చూసి ఆమె ముచ్చట పడుతుంది. వీలు దొరికినప్పుడల్లా ఉచితంగా వారిని గమ్యస్థానాలకు చేర్చుతోంది. వారి పయనం ఆగిపోకూడదనేది ఆమె వాంఛ. దేశ నేతలుగా స్త్రీలను చూడాలనేది ఆమె కల. నిజమైన ఆఫ్ఘన్ స్వాతంత్ర్యం మహిళ స్వేచ్ఛ, ఆర్థిక స్వాతంత్ర్యంలోనే ఉందని బలంగా తన వాణిని వినిపిస్తోంది. తనను చంపితే చంపుకోమని, ఎందరో బహాయ్‌లు తయారవుతున్నారని చాందసవాదులకు నవ్వుతూ జవాబు చెబుతోంది. యుద్ధంతో, తాలిబన్ల క్రౌర్యంతో పేదరికం అక్కడ తాండవిస్తోంది. ఎన్నో కుటుంబాలు ఆకలి సెగలకు ఆహుతైపోతున్నాయి. మాతృమూర్తి నడుం బిగించకపోతే శిశుమరణాలకు, ఆకలి చావులకు హద్దే ఉండదు. తమ ప్రాణం పోసుకున్న కన్న బిడ్డల్ని కాపాడటం అక్కడి తల్లుల ప్రథమ కర్తవ్యమయ్యింది. అప్పు తీర్చేందుకు, తెచ్చుకునేందకు బాలికల మీద సాగే నీచ వర్తకానికి తెరపడాలంటే ఆఫ్ఘన్ మహిళ ఉపాధి పొందాలనేది బహాయ్ మాట. ✦

కోప్పడితే ఏడ్చేస్తానన్నా...

చేతి నిండా సినిమాలతో ప్రియాంక చోప్రాకు క్షణం తీరిక లేదు. ఓ వైపు హాలీవుడ్ అవకాశం.... మరోవైపు 'దిల్ దడ్కనే దో' ప్రమోషన్ కార్యక్రమాలు... ఇంకోవైపు సంజయ్ లీలా భన్సాలి 'బాజీరావ్ మస్తానీ' చిత్రీకరణ... ఓహ్! ఎన్నని చెప్పాలి! తరచూ విదేశీ ప్రయాణాలు, నిత్యం షూటింగులతో పిగ్గీ చోప్స్‌కి క్షణం తీరిక లేదట. తన తాజా సినిమాల గురించి, సహ నటీనటులు, దర్శకుల గురించి ఆమె మాటల్లోనే....

చాలా బిజీగా వున్నా. ప్రపంచ పర్యటన చేయాల్సి వస్తోందనుకోండి. రణవీర్(సింగ్)తో ఇది నా రెండవ సినిమా. 'గూండే' సినిమాలో అతని ప్రేయసిని. ఈ చిత్రంలో అన్నా చెల్లెళ్లం. 'బాజీరావ్ మస్తాని'లో భార్యాభర్తలం. మేమిద్దరం రంగు తక్కువ కనక అన్నాచెల్లెళ్లగా సరిపోతాం (నవ్వుతూ).

★ వరుస చిత్రాల్లో ఒకరితోనే నటించడం వల్ల వారి గురించి చక్కటి అవగాహన కలిగి... కలిసి పని చేయడానికి వీలవుతుంది. రణబీర్(కపూర్)తో 'అంజానా అంజానీ, బర్ఫీ' చేశాను. షాహిద్‌తో 'కమీనే, తేరీ మేరీ కహానీ' చేశాను.

★ రణవీర్ గొప్ప నటుడు. పనిని చాలా సీరియస్‌గా తీసుకుంటాడు. అలా పని పట్ల శ్రద్ధ చూపే వాళ్లని నేను ఇష్టపడతాను.

★ 'దిల్ దడ్కనే దో' ఓ కుటుంబం, ఆ కుటుంబ సభ్యుల సంబంధ బాంధవ్యాల చుట్టూ నడిచే చిత్రం. ఏదో ఒక సమయంలో అమ్మానాన్నలు 'ఇది చెయ్యొద్దు. అది చెయ్యి' అని చెప్తూనే వుంటారు. సరిగ్గా అలాంటిదే ఈ సినిమాలోనూ వుంటుంది. కాకపోతే హాస్య ధోరణిలో కనిపిస్తుంది.

★ నేను అంతర్జాతీయ అందాల పోటీల్లో పాల్గొనడానికి వెళ్లేటప్పుడు మా కుటుంబంలో అందరికీ తెలియదు. ముందు అమ్మకు తెలుసు. తర్వాత నాన్నకు చెప్పాం. ఆయన అంగీకరించారు. కానీ కుటుంబంలో అందరికీ చెప్పడం పెద్ద సమస్య. మాది భారీ ఉమ్మడి కుటుంబం. అందరికీ ఇది నచ్చలేదు. తర్వాత వారిని శాంతింపచేశామనుకోండి. ఇన్నిటి మధ్య నన్ను స్వేచ్ఛగా, సొంతగా ఆలోచించే అమ్మాయిగా పెంచారు. ఎప్పుడూ అనుమతుల కోసం ఆగలేదు. ఆరోగ్యకరమైన వాతావరణంలో చర్చించుకుంటూ నిర్ణయించుకునేవాళ్లం. నాన్నకు ఆర్మీ నేపథ్యం వుండడంతో ఎప్పటికప్పుడు కొత్తవాళ్లు పరిచయమౌతుండేవాళ్లు.

★ మహిళా దర్శకురాలిగా జోయా అక్తర్ నటీనటుల గురించి బాగా శ్రద్ధ తీసుకుంటుంది. చాలా ప్రేమగా, సన్నిహితంగా మెలుగుతుంది. తనదైన సృజన, ఆలోచన ఆమెకు వుంటుంది. అందుకే ఇవాళ్టి గొప్ప దర్శకుల్లో ఐదుగురి పేర్లు చెప్పాల్సి వస్తే వారిలో జోయా తప్పక వుంటుంది.

★ దర్శకుడిగా ఫర్హాన్ అక్తర్ గురించి చెప్పుకోవాల్సి వస్తే... పని విషయంలో చాలా కఠినంగా వుంటారు. 'డాన్' చిత్రం చేసేప్పుడు అతనంటే చాలా భయపడిపోయేదాన్ని. షూటింగ్‌లో వున్నప్పుడు ఫర్హాన్‌తో మాట్లాడాల్సి వస్తే అతని మూడ్ ఎలా వుందో మరెవరినైనా అడిగి వెళ్లేదాన్ని.

★ 'దిల్ దడ్కనే దో'లో ఫర్హాన్ కూడా నటిస్తున్నాడని జోయా చెప్పినప్పుడు 'నిజంగా చెప్తున్నావా?' అనడిగానామెను. జోయా డిన్నర్ ఏర్పాటు చేసినప్పుడు 'నువ్వుగాని నన్ను కోప్పడితే ఏడ్చేస్తాను' అన్నాను ఫర్హాన్‌తో. కానీ ఆ చిత్రం షూటింగ్ అంతా చాలా హాయిగా నడిచింది.

★ హాలీవుడ్‌లో అవకాశం వచ్చినప్పుడు ఆశ్చర్యపోయాను. నా గురించి పూర్తి పరిశోధన చేశాకే వారు నన్ను కలిశారు. భారత్‌తో సహా 180 దేశాలలో 'క్వాంటికో' (అమెరికన్ టీవీ థ్రిల్లర్ సిరీస్)ను ప్రదర్శిస్తారు. ప్రపంచ నలుమూలల్లోని నటీనటులు నన్ను కలిసి ప్రశంసించినప్పుడు ఎంతో సంతోషంగా వుంటుంది. అన్ని దేశాల్లోను మన సినిమాలకు, తారలకు గుర్తింపు లభిస్తోందనడానికి ఇదో చిహ్నం. మన హిందీ సినిమా అంతగా ప్రభావితం చేస్తోందన్నమాట.

★ నిర్మాతగా 'మేడమ్‌జీ' చిత్రం చేపట్టినప్పటికీ చేతిలో అనేక సినిమాలు వుండడంతో తాత్కాలికంగా దాన్ని పక్కన పెట్టాను.

అక్కడి జైల్లో కుటుంబాలతో బతకొచ్చు. పనికెళ్లి డబ్బు సంపాదించుకోవచ్చు. వ్యాపారాలు చేస్తూ ఆస్తులు కూడబెట్టొచ్చు. సినిమాతో పాటు సరదాగా షికారుకెళ్లొచ్చు. ఇనుప కంచెలు, భారీ గేట్లు, ఆయుధాలు ధరించిన సిబ్బంది లాంటి దృశ్యాలు అసలే కనిపించవు. ఓ కాలనీలా కనబడే అసలది జైలు అంటే ఎవరూ నమ్మరు. జైపూర్‌లోని సంపూర్ణానంద ఖులాశివిర్ అనే ఈ ఓపెన్ జైలు కొన్ని నియమాలను అనుసరించి, ఖైదీలకు కొత్త జీవితం అందేలా చేస్తోంది.

ప్రత్యేకం

సంపూర్ణానంద్

ఎగిరే జైలు పక్షులు

ఖైదీల్లో మార్పు కోసం చాలా దేశాల్లో కొత్త విధానాలు వచ్చాయి. కొన్ని చోట్ల ఖైదీలు తమకిష్టమైన వారిని కలసి ఓ రోజు అక్కడే గడపొచ్చు. కొన్ని చోట్ల చేతి వృత్తులు చేసుకుని కుటుంబాలకు డబ్బులు పంపించొచ్చు. మరికొన్ని చోట్ల పెరోల్ సంపాదించి పెళ్లిళ్లు చేసుకోవచ్చు. ఈ వెసులుబాట్లన్నీ ఖైదీల్లో మంచి మార్పు తేవడానికే. ఇదే పంథాను అవలంబిస్తోంది రాజస్థాన్ జైళ్ల శాఖ. జీవిత ఖైదీలకు మరో జీవితాన్ని పొందేందుకు అవకాశం కల్పిస్తోంది. జైపూర్‌లోని సంగనేర్ గ్రామం వద్దనున్న ఓపెన్ జైలు ద్వారా సాధారణ జీవితాన్ని గడిపేందుకు అవకాశాన్నిస్తోంది. జైలు గోడల మధ్యే గడిపి శిక్ష పూర్తై తిరిగి సమాజంలోకి వచ్చాక వారి పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. వారిని చూసి భయపడి దూరం జరిగే బంధు, మిత్రులు కొందరైతే. సొంతూర్లకు వెళ్లలేక ఎక్కడో ఓ చోట తలదాచుకునేవారు కొందరు. అయితే వీళ్లందరికీ ఒక సమస్య కచ్చితంగా ఎదురవుతుంది. అదే ఉద్యోగ సమస్య. వీటన్నింటినీ సరిగా తీసుకోలేక, కొందరు మళ్లీ నేరమయ జీవితాల్లోకి జారిపోతుంటారు. శిక్ష వెనుక ఉద్దేశమే ఖైదీలో మంచి మార్పు. కానీ, ఆ మార్పు అంత కచ్చితంగా సాధ్యమవుతుందా అంటే చెప్పలేం. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకునే ఈ ఓపెన్ జైలును 1963 నుంచి తెరిచారు. హత్య కేసుల్లో శిక్షలు పడిన వారే ఇక్కడ ఎక్కువ. తొలుత 35 మందితో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ జైలు మంచి ఫలితాల్ని ఇచ్చింది. క్రమంగా మరో పన్నెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 90ల తర్వాత నుంచి దీని రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. ఖైదీలు సొంతగా ఏర్పాటు చేసుకున్న చిన్న ఇళ్లలో కుటుంబాలతో కలిసి నివసించడం ప్రారంభించారు. పది ఎకరాల్లో ఉన్న స్థలంలో ఇప్పుడు నివాసాల సంఖ్య 150 పైకి చేరుకుంది. 10 మంది మహిళా ఖైదీలతో కలిపి మొత్తం 169 మంది ఉన్నారు. వారి పిల్లల కోసం దగ్గరలోనే ఓ పాఠశాల ఉంది. జైలు లోపలే ఓ దేవాలయం ఉంది. అక్కడ మూడో వంతు ఇళ్లలో టీవీ కనెక్షన్లున్నాయి. ఇంటర్‌నెట్ సదుపాయానికి అనుమతి లభిస్తోంది. రిఫ్రిజిరేటర్లు, కూలర్లు వంటి వాటితోపాటు బైక్‌లు, కార్లు ఇక్కడ కానవస్తాయి. లారీల సప్లై వ్యాపారి, ఓ హోమియోపతి వైద్యుడు, ఉపాధ్యాయులతోపాటు కూలీకెళ్లే ఖైదీలున్నారు. వారి సంపాదనతోనే పిల్లలకు చదువులు చెప్పిస్తున్నారు. కుటుంబాలను సినిమాలకు తీసుకెళుతున్నారు. తెరిచి ఉండే ఈ జైలులోకి వెళితే పిల్లల ఆటలతో, పెంపుడు జంతువులతో, వృద్ధుల పచార్లతో సందడిగా ఉంటుంది. అదేదో కాలనీలోకి వచ్చారనే భ్రమ కలుగుతుంది.

ఓపెన్ జైల్లో నివసించడానికి అందరూ అర్హులు కారు. రేపిస్టులు, సీరియల్ కిల్లర్‌లు, మాదక ద్రవ్య వ్యాపారులు, కిరాయి హంతకులు, ఉగ్రవాదులు, కుట్రదారులు తదితరులకు ఆ అవకాశం లేదు. క్షణికావేశంలో హత్య చేసి శిక్షపడిన వారికి అవకాశమిచ్చేందుకు పరిశీలిస్తారు. శిక్ష కాలంలో మూడోవంతు పూర్తై ఉండాలి. ఆ రాష్ట్రానికే చెందిన 25 నుంచి 60 ఏళ్ల మధ్యనున్న వివాహితులైన ఖైదీలకు అవకాశం కల్పిస్తారు. అదీ, వారి సత్ప్రవర్తనపైనే ఆధారపడి ఉంటుంది. కఠినమైన స్క్రీనింగ్ టెస్ట్ (అర్హత పరీక్షల) ద్వారా ఖైదీలను ఎంపిక చేస్తారు. ఉదయం ఆరు గంటల తర్వాత జైలు బయటకు వెళ్లేందుకు అనుమతి లభిస్తుంది. బయటకు వెళ్లినవారు సాయంత్రం ఏడింటి కల్లా తిరిగి వచ్చేయాలి. జైలు నుంచి పది కిలోమీటర్ల పరిధిలోపు వృత్తి, వ్యాపారాలు చేసుకోవచ్చు. అనుమతి తీసుకుని సినిమాలకు, షికార్లకు వెళ్లొచ్చు. ఏ పనిపై వెళుతున్నారో చెప్పాలి. ఇక్కడ కొన్నేళ్లపాటు గడుపుతున్న ఖైదీలున్నారు. ఇక్కడి ఖైదీలు ఓ సంఘంగా ఏర్పడి వారి మధ్య సమస్యల్ని పరిష్కరించుకుంటున్నారు. అప్పటి రాజస్థాన్ గవర్నర్ సంపూర్ణానంద్ ఆలోచనే ఈ జైలు. 'దో ఆంఖే బారా హాత్' అనే సినిమా ఆయన్ను బాగా కదిలించిందట. అందులో చూపించిన ఖైదీల పరిస్థితిని అర్థం చేసుకున్న ఆయన ఈ జైలును ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నారట. బెయిల్ మంజూరైనా జుర్మానా కట్టేవారు లేక, కేసుల గతి ఎటు పోతుందో తెలీక జైళ్లలో మగ్గిపోతున్నవారికీ ఇలాంటి అవకాశం దొరికితే ఆయన లక్ష్యం మరింత చేరువవుతుంది. ఈ ఓపెన్ జైలు నుంచి తప్పించుకుపోయిన వారు ఉన్నా, చాలా మంది నియమాల్ని ఉల్లంఘించకుండా కుటుంబాలతో హాయిగా గడుపుతున్నారు. ఆ జైల్లో ఉన్న కుటుంబాలను బంధువులు, మిత్రులు కలవొచ్చు. అనుమతి తీసుకుని కొన్ని రోజులు ఉండొచ్చు. ఇలాంటి వాతావరణం వారిలో మార్పు తీసుకు వస్తుందని అధికారుల నమ్మకం. కుటుంబాలతో ఉంటే బాధ్యతగా ఉంటారనీ అంటున్నారు. కరెంట్ బిల్లుల దగ్గర నుంచి నిత్యావసరాలకు ఖైదీలే సంపాదిస్తుండటంతో నిర్వహణ కూడా తేలిక అవుతుందనీ చెబుతున్నారు.

జేఎస్పీ

ఎడారిలో రంగుల నగరాలు

భారతదేశంలో అతి సుందరమైన నగరాల్లో రాజస్థాన్‌లోని పింక్ సిటీ, నీలాకాశాన్ని తలపించే బ్లూ సిటీ పర్యాటకులను అబ్బురపరుస్తాయి. అవే జైపూర్, జోధ్‌పూర్ పట్టణాలు. అక్కడి కట్టడాలూ, కోటలూ, స్థానికుల వస్త్రధారణ వింతగా ఉంటాయి. రాజపుత్రుల కళాపోషణకు, శౌర్యపరాక్రమాలకు నిదర్శనాల్లాంటి రాజప్రాసాదాలు, నాటి రాజుల చిత్రలేఖనాలు, ఇతర కళాత్మక వస్తువులు సందర్శకులను కళ్లు తిప్పుకోనీయవు.

భారతదేశంలో ప్రణాళిక ప్రకారం నిర్మించిన మొట్టమొదటి నగరం పింక్ సిటీ అని చెప్తుంటారు. ఈ నగర వీధులు ఎప్పుడు చూసినా పర్యాటకులతో కిటకిటలాడుతుంటాయి. నగరంలోని నాటి భవనాలు... రాజపుత్రుల రాజసానికి, దర్పణానికి అద్దం పడతాయి. వారి కళాభిరుచి, శిల్పుల నైపుణ్యం విభ్రమాన్ని కలిగిస్తాయి. హవా మహల్, సిటీ ప్యాలెస్, అంబర్ కోట భారత దేశ నిర్మాణ సౌందర్యానికి ఉదాహరణగా ఉన్నాయి. పతంగుల పండుగ, ఏనుగుల పండుగ ఇంకా ఇతర పండుగలెన్నో ఇక్కడివారు జరుపుకుంటారు. ఇక్కడి స్త్రీలు కూడా కత్తిపట్టి యుద్ధం చేసేవారు. జైపూర్‌లో ఆచారాలు, సాంప్రదాయాలు, నాగరికత మెండుగా ఉంటాయి.

గులాబీ నగరం

1727లో మహారాజా సవాయి జై సింగ్ -2 ఈ నగర నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆయన ఈ నగరాన్ని 1699 నుండి 1744 వరకు పరిపాలించాడు. మొదట్లో అంబర్ ఆయన రాజ్యానికి రాజధానిగా ఉండేది. అంబర్ నగరం జైపూర్‌కు 11 కిలోమీటర్ల దూరంలో ఉంది. అంబర్‌లో జనాభా పెరిగిపోయి నీటి వనరులకు కొరత ఏర్పడడంతో ఆయన ఈ నగరాన్ని ఒక ప్రణాళిక ప్రకారం నిర్మించారు. దీనికోసం భవన నిర్మాణానికి సంబంధించిన అనేక రకాల గ్రంథాలను ఆయన పరిశీలించాడు. చివరకు అంబర్ కోశాగారంలో పనిచేసిన విద్యాధర భట్టాచార్య మార్గదర్శకాన ఈ నగరాన్ని నిర్మించారు. తరువాత ఆయనను ముఖ్య వాస్తుశిల్పిగా నియమించారు. ఆయన బెంగాల్‌కు చెందిన పండితుడు. ఈ నగరం మొత్తం 9 విభాగాలుగా ఉంటుంది. రెండు విభాగాలలో రాజభవనాలు, ప్యాలెస్‌లు ఉంటాయి. మిగిలిన ఏడు విభాగాలను ప్రజలకు కేటాయించారు. ఏడు కోటగోడలను కట్టుదిట్టమైన ద్వారాలతో నిర్మించారు. అప్పట్లో ఈ నిర్మాణ శైలి దేశంలోనే అత్యాధునికమైంది. 1853లో వేల్స్ రాజు జైపూర్‌ను సందర్శించడానికి రాబోయే ముందు నగరాన్ని అలంకరించాలన్న ఉద్దేశంతో సవాయి రామ్ సింగ్ భవనాలన్నిటికీ గులాబీ రంగును వేయించాడు. అప్పటి నుంచి ఈ నగరానికి పింక్ సిటీగా పేరు పెట్టారు.

సిటీ ప్యాలెస్

సిటీ ప్యాలెస్ ఒక విచిత్రమైన కట్టడం. దీన్ని ఒక పజిల్లా శత్రువులకు దారి తెలియకుండా నిర్మించారు. మొఘలుల, రాజపుత్రుల భవన నిర్మాణ శైలి ఈ కోటలో కనిపిస్తుంది. దీని ప్రవేశ ద్వారం వద్ద స్వాగతం పలుకుతున్నట్టుండే రెండు పెద్ద ఏనుగుల శిల్పాలు చాలా అందంగా ఉంటాయి. కోట ముఖ ద్వారాలు సందర్శకులను అక్కడి నుండి కదలనీయవు. వాటిమీద చెక్కిన రకరకాల పూలు, బొమ్మలలో నాటి శిల్పుల నైపుణ్యం తొణికిసలాడుతుంది. ఈ ప్యాలెస్‌లో ఏడంతస్తులుంటాయి. ఎంతో విశాలమైన గదులు, అద్భుతమైన చిత్రకళ జాలువారే పెద్దపెద్ద తలుపులు, కిటికీలు అందులో ఉంటాయి. అంతేకాదు ఇందులో ఒక మ్యూజియం కూడా ఉంటుంది. ఇది అపురూపమైన సంపదకు ఆలవాలం. మొఘలుల, జైపూర్ రాజుల కాలం నాటి చిత్రాలను, మధ్యయుగం నాటి పర్షియా, ఆఫ్ఘన్ కార్పెట్లను, రాజకుటుంబీకులు ధరించిన వస్త్రాలను ఈ మ్యూజియంలో చూడొచ్చు. ఈ కోటలో అతి ముఖ్యమైనది రాజకుటుంబీకులుండే చంద్ర మహల్. ఈ మహల్ గోడలపై మహారాజా ప్రతాప్ జీవిత ముఖ్య ఘట్టాలను పెయింటింగులతో ఎంతో అందంగా చిత్రీకరించారు. యుద్ధ సమయంలో ఆయన ఉపయోగించిన ఈటె, డాలు వంటి ఆయుధాలను కూడా మనమీ పెయింటింగులలో చూడొచ్చు. రాణా ప్రతాప్ గుర్రం 'చేతక్' ధరించిన కవచం, ఎత్తైన మార్బుల్ సింహాసనం, అద్దాల డిజైన్లు, ఇంకా ఇతర పెయింటింగులు ఇక్కడ ఉన్నాయి.

ఈ కోటమీది నుండి చూస్తే గులాబీ రంగు భవనాలతో ఆ నగరమంతా ఎంతో అందంగా, ముచ్చటగా ఉంటుంది. ఈ కోట జైపూర్ పట్టణ పర్యాటక ప్రదేశాలకు ప్రధాన కేంద్రం. కోటకు కిలోమీటరు దూరంలో జస్వంత్ తాడా అని ఒక ప్రాంతముంటుంది. ఇక్కడ రాజుల సమాధులుంటాయి. వీటిని పల్చటి చలువరాయితో నిర్మించారు. వాటిలో మొదటి రాణా సమాధి చాలా పెద్దగా ఉంటుంది. ఎండా కాలంలో ఇక్కడ ఉష్ణోగ్రత చాలా ఎక్కువగా ఉండడం వల్ల ఈ నగరాన్ని సన్ సిటీ అని కూడా అంటారు.

ప్యాలెస్ ఆఫ్ విండ్స్

హవా మహల్‌నే ప్యాలెస్ ఆఫ్ విండ్స్ అని అంటారు. ఇది సిటీ ప్యాలెస్‌కు పశ్చిమాన ఉంటుంది. దీన్ని కూడా గులాబీ రంగుతో నిర్మించారు. దీనిలో ఐదంతస్తులుంటాయి. ఉదయం సూర్యకాంతి పడుతున్న సమయంలో గులాబీ రంగులో మెరిసిపోయే ఈ భవనం అందం చూడ్డానికి రెండు కళ్లు చాలవేమో అనిపిస్తుంది. సందర్శకులు ఆ అందాన్ని తమ కెమెరాల్లో బంధించడానికి క్యూలో నిల్చుని ఉంటారు. దీనిని 1799లో నిర్మించారు. దీనికి 593 కిటికీలు ఉంటాయి. వీధుల్లో జరిగే ఉత్సవాలను రాణీవాసపు స్త్రీలు చూసేందుకు ప్రత్యేకంగా దీన్ని నిర్మించారు. విశాలమైన, కళాత్మకత ఉట్టిపడే ఆర్చీలతో బాల్కనీలు... ఈ భవనం చూడముచ్చటగా ఉంటుంది.

జైపూర్ నగరానికి ఈశాన్య దిక్కున 3 కిలోమీటర్ల దూరంలో నహర్ ఘర్ కోట ఉంది. ఈ కోటను రెండో జైసింగ్ తన రాణుల కోసం 1734లో నిర్మించారు. దీనిలో రాణుల గదులు వర్తులాకారంలో ఉంటాయి. ఇంకా జైఘర్, జంతర్ మంతర్ కోటలు, జల్ మహల్, రామ్‌బాఘ్ ప్యాలెస్ సందర్శకులను అబ్బురపరుస్తాయి.

సూర్య దేవాలయం

కోటలూ, రాజప్రాసాదాలేకాక ఆలయాలు, ప్రకృతి సుందరమైన దృశ్యాలు ఎన్నో జైపూర్‌లో ఉన్నాయి. పర్యాటకులను కట్టిపడేస్తాయి. జైపూర్‌కు దక్షిణంగా ఉన్న కొండపై గాల్టా ఉంది. ఇది వాలుగా ఉండే కొండ ప్రాంతం. సుమారు 250 ఏళ్ల నాటి దేవాలయాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. అందులో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది సూర్య దేవాలయం గురించి. ఆ ఆలయ ప్రాంగణం, అక్కడి శిల్పాలు, అక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటాయి. దీనికి సమీపంలో రెండు రాతి ట్యాంకులుంటాయి. పైనున్న ట్యాంకులోని నీళ్లను సందర్శకులు, అక్కడి ప్రజలు తాగుతారు. కిందనున్న ట్యాంకులోవి కోతులు తాగుతాయి. ఈ రెండు రాతి ట్యాంకులలోకి నీరు మాత్రం ప్రకృతి సిద్ధంగానే వస్తాయి.

నీలి నగరం

జైపూర్‌లో అన్నీ గులాబీ రంగు భవనాలున్నట్లే జోధ్‌పూర్‌లో ఇళ్లన్నీ నీలి రంగులో ఉంటాయి. అందుకే దీన్ని బ్లూ సిటీ అంటారు. ఈ నగరాన్ని చూస్తుంటే నీలాకాశం కిందకు వచ్చిందేమిటా అనిపిస్తుంది. ఈ నగరంలో 26 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఉమెద్ భవన్ ప్యాలెస్ చాలా బాగుంటుంది. దీన్ని ఉమెద్ సింగ్ 1929లో నిర్మించాడు. దీని నిర్మాణానికి సుమారు 14 ఏళ్లు పట్టింది. దీని నిర్మాణానికి ఒక గొప్ప కారణముంది. జోధ్‌పూర్‌లో కరవు సంభవించి ప్రజలకు పనులు లేని సమయంలో వారికి ఉపాధి కల్పించడానికి దీని నిర్మాణాన్ని చేపట్టారు. దాదాపు 15 ఏళ్ల పాటు సుమారు 3000 మందికి ఉపాధి కల్పించిందీ కోట. ఈ కోటలో మొత్తం 347 పడక గదులున్నాయి. దీని పైకప్పు సుమారు 105 అడుగుల ఎత్తులో ఉంది. సూర్యకాంతి గమనానికి అనుగుణంగా మారుతూ సూర్యకాంతి లోపలికి ప్రవేశించే విధమైన అద్దంను దీనికి ఏర్పాటు చేశారు. ఈ భవనాన్ని మూడు విభాగాలుగా చేశారు. ఒక విభాగంలో రాజు ఉంటారు. మరో విభాగాన్ని మ్యూజియంగా మార్చారు. దీనిలో రాజులు వేసిన చిత్రాలు, పెయింటింగులు, రాణుల ఆభరణాలు, వస్త్రాలు, బొమ్మల రూపంలో రామాయణం వంటివి ఉంటాయి. మూడో విభాగంలో హోటల్ ఉంది. 1975లో రాజభరణాలు రద్దయిన తరువాత ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనడానికి ఈ విభాగాన్ని హోటళ్లకు లీజుకిచ్చారు.

షాపింగు

జాతి రాళ్లు, బంగారు ఆభరణాలకు పెట్టింది పేరు జైపూర్. ఎనామెల్ పెయింటింగుతో ఆభరణాలు ఎంతో బాగుంటాయి. అందమైన పాలరాతి బొమ్మలు, ఊలుతో చేసిన కార్పెట్లు, కాటన్ రగ్గులు ఎంతగానో ఆకట్టుకుంటాయి. నెహ్రూ బజార్, బాపూ బజార్‌లలో దొరికే వస్త్రాలు, పెర్ఫ్యూమ్స్, ఒంటె చర్మంతో చేసిన చెప్పులు ఇక్కడ మనం కొనుక్కోవచ్చు. సాంప్రదాయక రాజస్థానీ దుస్తులకు ట్రిపోలియా బజార్ సుప్రసిద్ధం.

అద్దాల్లో సంద్రం

గౌరామి మీనాల ప్రేమ సన్నివేశాలు. డిస్కస్ చేపల హోళీ ఈదులాటలు. భారీ జలలోకపు వాసుల పలకరింపులు. ఎంత ఇంపుగా ఉంటాయి మనసుకు. సంద్రాన్ని కట్టిపడేసిన గాజు ఫలకాల మధ్య కాలిబాటల్లో మన విహారాలు. మునక వేయకుండానే జలచరాలతో సాగే మన ముద్దు ముచ్చట్లు. ఎంత గమ్మత్తుగా ఉంటుంది ఆ సందర్శన. నదీమ తల్లుల అబ్బురాల్ని, సముద్రగర్భ అద్భుతాల్ని కడుపున పెట్టుకుని చూపిస్తాయి అక్వేరియాలు. ఉగ్గబట్టుకోలేక కేరింతలు కొట్టే పెద్దల్ని.. చిన్నారుల్ని చేసే మాయా లోకమది. మత్తు నిద్రలో పొర్లాడే చిన్నారుల కలల ప్రపంచాన్ని గాజు అద్దాల్లో నిలిపిన మంత్రమది. ఈత రాని వాడికి జలచరాలతో జత కట్టించి స్నేహం చేయించే మార్మిక మత్స్య యంత్రమది.

ఊపిరాడనంత ఉక్కిరి బిక్కిరి చేస్తాయి ఆక్వేరియాల అందాలు. నీటిలో ఊపిరి నిలుపుకోలేని మనిషికి ఒకటే ఆశ.. విశాల సంద్రాన రంగుల విహారం చేసే చేపల ఈతల్లో మునిగిపోవాలని. కాలం తెలీకుండా వాటి ప్రయాణాల్లో పరవశులైపోవాలని. ఆక్వేరియాల అవసరం ఆ కోరిక నుంచి పుట్టిందే. నీటి నుంచి బయట పడ్డ చేప పిల్లలాంటి పరిస్థితి ఆ విషయంలో మనిషిది. నాలుగన్నర వేల ఏళ్ల క్రితం సుమేరియన్లు నానా తంటాలు పడి కృత్రిమ కొలనుల్లోకి చేపల్ని చేర్చి హమ్మయ్య అనుకున్నారు. వారికి దగ్గర కాలానికి రోమన్లు పడకల కింద చేపల తొట్టెల్ని తీసుకువచ్చారు. ప్రాచీన ఈజిప్ట్, అస్సిరియన్, ఇండో, చైనాలూ మచ్చిక చేసుకునేందుకు మీనాల వెంట పడ్డాయి. అప్పటి వరకు చిన్న కొలనుల్లో చూసి మురిసిపోయిన వారికి క్రీ.శ. 50 నాటికి పారదర్శక అద్దాల గోడల్ని గ్రీకులు పరిచయం చేశారు. చైనీయులకు మత్స్య మర్మం అంతుబట్టిందేమో మూడు వేల ఏళ్ల క్రితమే గోల్డ్‌ఫిష్‌లను కృత్రిమ వాతావరణంలో సంతానోత్పత్తి చేయించగలిగారు. అవి వారికి శుభం కలిగిస్తాయనే నమ్మకం విస్తరించి, 1369 నాటికి చైనా చక్రవర్తి హోంగ్వూ ప్రత్యేకంగా గోల్డ్‌ఫిష్‌లను ఉంచే పోర్సిలిన్ అద్దపు కుండల కర్మాగారాన్ని స్వయంగా స్థాపించాడు. ఎక్కడ ఎలా మొదలైనా 19 శతాబ్దం నుంచే ఈ అక్వేరియాలు భారీగా కనువిందు చేశాయి. 1850 విక్టోరియన్ ఇంగ్లండ్‌లో ఫిలిఫ్ హెన్రీ గొస్సెతో నామకరణం చేయించుకుని ప్రపంచానికి వెర్రెక్కించిన అక్వేరియం.. దాని పరిమాణం నుంచి పరిధి, ప్రచారాల్ని విస్తృతం చేసుకుంటూ పోయింది. రసాయన వేత్త రాబర్ట్ వారింగ్టన్ నియమంతో ఆక్సిజన్ అంది ప్రాణం పోసుకుని, ఎడ్వర్డ్ ఎడ్వర్డ్స్ జల ప్రసరణ వ్యవస్థతో మనుగడ పెంచుకుని 1853న లండన్ జూలో తొలి పబ్లిక్ అక్వేరియంలా మారి ప్రజలకు ఆహ్వానం పలికింది. అప్పటికే చిన్న చిన్న అద్దాల గోడల మధ్య ఇళ్లలోకి వరదెత్తిన అక్వేరియం కల్చర్ భారీదనాన్ని సంతరించుకుని హుందాగా నిలిచింది. ప్రపంచంలో ఎక్కువగా



పెంచుకుంటున్న పెంపుడు జంతువుల హాబీల జాబితాలో అగ్రస్థానానికి పోటీ పడుతూ ప్రతి దేశానికి చేరింది. ఇప్పుడు అమెరికాలో నాలుగు కోట్లు, జర్మనీలో రెండు కోట్లతో కలిపి యూరప్, జపాన్, చైనా, ఆస్ట్రేలియా, మన ఇండియాలో కొన్ని కోట్ల చేపలు ఇళ్లలోని అక్వేరియాల్లో పెంపుడు జంతువులై పేర్లు పెట్టుకున్నాయి. చిట్టి చేపల నుంచి షార్క్‌లు, డాల్ఫిన్ల వరకు లక్షలాది జలచరాలకు ఆవాసాలైన భారీ పబ్లిక్ అక్వేరియాలెన్నో ప్రపంచమంతా ఉన్నాయి. కేవలం సందర్శనకే కాక పరిశోధనలకు ఉపయోగపడుతున్నాయి.

'చేప' మందు

గమనించి ఉంటారో లేదో అక్వేరియం చూసేటపుడు పిల్లలు ఎంత శ్రద్ధగా చేపల్ని పరిశీలిస్తుంటారో, ఎంత ప్రశాంతంగా ఉంటారో. ఇది పిల్లలే కాదు పెద్దలకు చాలా హాయిని, సాంత్వన, ప్రశాంతతను ఇచ్చే హాబీ. నిరంతరం ఒత్తిడిని కలిగించే నేటి పోటీ వాతావరణం, వృత్తి, ఉద్యోగాలు, మానసిక, వ్యక్తిగత ఇబ్బందుల నుంచి మన మూడ్‌ను తేలిగ్గా మళ్లించగలుగుతుంది. కేవలం అక్వేరియంను ఇంట్లో ఉంచుకోవడమే కాదు యానిమేటెడ్ అక్వేరియం వాల్‌పేపర్లను చూసినా కూడా మనసు తేలిక పడుతుందని అంటున్నారు. కంప్యూటర్ కొలువుల్లో కాస్త తీరిక చేసుకుని అక్వేరియం వాల్‌పేపర్లను చూసి రిలాక్స్ అవ్వాలంటున్నారు. మంచి సంగీతం మిళితమైనవి లేదా కేవలం నీటి శబ్దాలతో కూడిన అక్వేరియం వీడియోలు సీడీలు, డీవీడీల రూపంలో మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చాయి. కర్టెన్లు, ఆర్టికల్స్, వాల్ డెకార్లు కూడా వచ్చేశాయి. ఎన్నో అక్వేరియం వీడియోలు యూట్యూబ్‌లో స్ట్రీమ్ అవుతున్నాయి. వర్చువల్ అక్వేరియాలు మాల్స్‌ను, పబ్లిక్ పాయింట్లను ముస్తాబు చేస్తున్నాయి. అచ్చు అక్వేరియం ఉన్నట్టే మాయ చేసే వీటిని భారీ ఎల్‌ఈడీ తెరలపై ప్లే చేస్తారు. దుబాయ్‌లోని హోటల్ అట్లాంటిస్‌లో పడక గదుల్లో పెద్ద పెద్ద అక్వేరియాల్ని ఉంచారు. పడక చుట్టూతా అక్వేరియం ఉండేలా బెడ్డులూ ఉన్నాయి. కాఫీ టేబుళ్ల దగ్గర నుంచి వాల్ మౌంట్ అక్వేరియంల ట్రెండ్ ఎక్కువగా ఉంది. మాల్దీవుల్లోని హిల్టన్ రెస్టారెంట్ అండర్ వాటర్ రెస్టారెంట్ ఓ అద్భుతం. పైనుంచి జలచరాలు వెళుతుంటే అద్దాల కింద నుంచి వాటిని వీక్షించడం మరపురాని అనుభూతి.



ఒత్తిడి, కుంగుబాటుకు విదేశాల్లో ఇపుడు సరికొత్త మందు అక్వేరియమ్ థెరపీ. తీవ్ర ఒత్తిడికి లోనైన వారికి కొద్ది సేపు అక్వేరియమ్‌ను చూస్తూ గడపమని మానసిక వైద్యులు సూచిస్తున్నారు. రంగురంగుల చేపల కదలికల వల్ల కలర్ థెరపీతో పాటు అక్వేరియం వాతావరణం సాంత్వన కలిగిస్తుందని నిపుణులు నమ్ముతున్నారు. ఆందోళన, కుంగుబాటుకు లోనైన వారు త్వరగా బయటపడేందుకు అక్వేరియం థెరపీతో మంచి ఫలితాలు నమోదు అవుతున్నాయి. స్కిజోఫ్రెనియాతో బాధపడుతున్న వారిలో కూడా మంచి లక్షణాలు కనిపిస్తున్నాయని గుర్తిస్తున్నారు. పర్డ్యూ అనే సంస్థ 2004లో చేసిన పరిశోధనలో, ఎలక్ట్రో కనవల్సివ్ థెరపీ (షాక్ ట్రీట్‌మెంట్)కి వెళ్లవలసినవారిలో అక్వేరియం థెరపీతో మంచి ప్రభావం ఉంటోందని నిర్ధారించారు. షాక్ ట్రీట్‌మెంట్ చేసేటపుడు ఉండే

రక్తపోటు గానీ, గుండె దడ కానీ అక్వేరియంను చూస్తూ గడిపిన వారిలో కనిపించలేదు. రోగుల్లో 12 శాతం వరకు ఆందోళన తగ్గినట్టుగా తేలింది. చాలా మందికి దంత వైద్యం చేయించుకునే విషయంలో ఆందోళనకు, భయానికి గురవుతారు. 1985లో కొందరు దంత వైద్యులు హిప్నాసిస్‌కు బదులు అక్వేరియం థెరపీని ప్రయోగించి చూశారు. ఊహించని విధంగా మంచి ఫలితాలు కనిపించాయి. చాలా దంత వైద్యశాలల్లో అక్వేరియంలను ఏర్పాటు చేస్తున్నారు. అక్వేరియంను చూస్తే కండర వత్తిడి, నాడీ స్పందనల వేగం కూడా సాధారణ స్థాయికి వస్తున్నాయని గమనించారు. పర్డ్యూ సంస్థ 2009లో చేసిన మరో పరిశోధనలో మరో ఆసక్తికర విషయాన్ని గమనించారు. స్కిజోఫ్రెనియాతో బాధపడే రోగులు అక్వేరియం థెరపీ ద్వారా వారు తీసుకునే పోషకాహారం 17.2 శాతానికి పెరిగిందని తేలింది. మానసిక రోగుల్లోను, సాధారణ వ్యక్తుల్లోను కోపం, దుందుడుకు స్వభావం తగ్గినట్టు తెలిసింది. అమెరికాలోని కనెక్టికట్‌లోని మిస్టిక్ అక్వేరియంలో 'టచ్ అండ్ లెర్న్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. ఎదుగుదల, అ

భ్యాసన, సాంఘిక తదితర విషయాల్లో ఇబ్బందుల్ని ఎదుర్కుంటున్న పిల్లలకు తరగతులు నిర్వహిస్తున్నారు. హైపర్ యాక్టివిటీ సమస్యలున్న చిన్నారుల్లో కూడా అక్వేరియం థెరపీతో మంచి మార్పులు వస్తున్నాయని తేలింది.

పబ్లిక్ అక్వేరియాలకు ఓటు

పబ్లిక్ అక్వేరియాలకు ఓటు వేస్తున్నారు జలచర ప్రేమికులు. చిన్న సైజు డిస్కస్‌లు, గోల్డ్ ఫిష్‌ల నుంచి భారీ స్థాయి డాల్ఫిన్లు, షార్క్‌లు, తిమింగలాల వరకు, సీ లయన్స్ నుంచి పెంగ్విన్ల వరకు, ఆల్గేల నుంచి సముద్రపు మొక్కల వరకు, కోరల్ రీఫ్స్‌తో సహా సమస్త జలచరాల్ని సందర్శించేందుకు వీలుగా భారీ అక్వేరియంలు ప్రపంచమంతటా ఉన్నాయి. దుబాయ్ మాల్‌లోని అక్వేరియం అండ్ డిస్కవరీ సెంటర్‌లో సుమారు 33 వేల జలచరాలు విహరిస్తున్నాయి. 85 జాతులకు చెందిన వీటిలో అన్ని సముద్రాల్లోని ప్రాణులను చూడొచ్చు. పెద్ద పెద్ద అక్రిలిక్ అద్దాల గుండా వాటిని చూస్తుంటే కాలం తెలీదు. 2002లో తెరిచిన జపాన్‌లోని ఒకినావా చురామి అక్వేరియం అతి పెద్ద అక్రిలిక్ అద్దం కలిగినది. ఇక్కడ అతి అరుదైన మంత రే చేపలు జన్మించాయి కూడా. చైనా అక్వేరియంకు వస్తే అతి పొడవైన టన్నెలున్న అక్వేరియంగా ఇది ప్రత్యేకత పొందింది. సుమారు 155 మీటర్లున్న ఈ టన్నెల్ గుండా వెళుతుంటే సముద్రం అడుగున జలచరాల లోకంలో నడిచినట్టే ఉంటుంది. మంచినీటి చేపలైన యాంగ్జీ నది జలచరాల్ని ఇక్కడ చూడొచ్చు. అంతరించిపోయే దశలో ఉన్న ఆ నదీ మొసళ్లు, సాలమండర్‌లను కాపాడుతున్నారు. చైనీస్ వాటర్ డ్రాగన్లు, అరుదైన పెంగ్విన్లను ఇక్కడ చూడొచ్చు. కాలిఫోర్నియాలోని మానెటరీ బే అక్వేరియం 1984లోనే తెరిచారు. 623 జాతులకు చెందిన సుమారు 35 వేల జలచరాలు ఇక్కడ ఉన్నాయి. భారీ తిమింగలాల్ని సందర్శించొచ్చు. హ్యామ్మర్‌హెడ్ షార్క్‌లు, స్ట్రింగ్ రేలు, బ్లూఫిన్ ట్యూనా, జెల్లీ ఫిష్, వోల్ఫ్ ఈల్స్ కనిపిస్తాయి. స్పెయిన్‌లోని వేలెన్షియా ఎల్ ఓషియానోగ్రఫిక్ కలువను పోలిన ఆకృతిలో ఉన్న అక్వేరియం. యూరప్‌లోనే పెద్దదైన దీనిలో లక్షా పదివేల చదరపు మీటర్ల స్థల నిర్మాణంలో అంటార్కిటికా, ఆర్కిటిక్, మెడిటేరియన్ సముద్రాలకు చెందిన 45 వేల జలచరాలున్నాయి. పబ్లిక్ నిధులు కూడగట్టి నిర్మించిన పెద్ద అక్వేరియం టర్కీలో ఉంది.

ఈత తేలికేం కాదు

అక్వేరియాల నిర్వహణ చాలా పెద్ద పనే. శాస్త్రీయంగా ఆక్వేరియంను నిర్వహించాల్సి ఉంది. ఆక్సిజన్, నైట్రోజన్ సైకిళ్ల మర్మంపై అవగాహన ఉండాలి. ఫాస్ఫేట్లు, మినరల్స్‌ల విషయం తెలుసుకోవాలి. సహజసిద్ధమైన జలావాసాల్లో తేలిగ్గా ఈదులాడే ఈ ప్రాణులు అంత తేలిగ్గా అక్వేరియాల్లో బతకలేవు. నీటి నాణ్యత, రసాయనికతల్లో ఏ మాత్రం తేడా వచ్చినా వాటి ప్రాణాలు నీటిపాలు అవుతాయి. అక్వేరియాల నిర్వహణలో ప్రధానమైనవి.. నీటి పీహెచ్ విలువ, రసాయనాల శాతం, ఆక్సిజన్ ప్రసరణ, వ్యర్థాల తొలగింపు, ఉష్ణోగ్రత మార్పులు, ఆహార సరఫరా. వీటికి తోడు ఓస్మాటిక్ ఎఫెక్ట్. అంత చిన్న తొట్టెకు ఇన్ని అంశాల వివరం కావాల్సిందే. అన్నింటి కంటే ముఖ్యంగా తెలియాల్సింది పరిమాణం నిష్పత్తి. చిటికెడంత చేప పిల్లకు ఊపిరి ఆడాలంటే లీటరుకు పైగా నీరు కావాలి, అర మీటరంత స్థలం ఉండాలి. ఇదీ ప్రతి చేపకూ మారుతూ ఉంటుంది. రెండు వారాలకు ఓ సారి 10 నుంచి 20 శాతం కొత్త నీటిని మార్చాలి. వేడి అవసరమున్న వాటికి లైట్లతో ఉష్ణాన్ని అందించి థర్మామీటర్లతో సరిచూసుకోవాలి. వేడి తట్టుకోని వాటికి కూలర్లు, ఎయిర్ కండిషనర్లను పెట్టాలి. జీవ, రసాయన, యాంత్రిక విధానాల్లో వడగట్టే విధానాలతో శుభ్రపరుస్తూ ఉండాలి. చేపల ప్రవర్తన, వాటి బరువు, పరిమాణంలో మార్పుల్ని ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. రోజువారీ, వారం, రెండు వారాలు, నెలవారీ చెకప్‌లు తప్పనిసరి. పారసైట్లు, సూక్ష్మజీవులు పోగవకుండా మందుల్ని వాడాలి. ముఖ్యంగా తెలుసుకోవాల్సింది.. ఉప్పు నీటి, మంచి నీటి చేపలకు మధ్య తేడా. నీరు తారుమారైతే అవి బతకవు. మంచి నీటి చేపలకు కుళాయి నీళ్లు అస్సలు వాడకూడదు. క్లోరిన్ వాటి ప్రాణాల్ని హరించేయగలదు. చిన్న చేపలు పెద్ద వాటికంటే ఎక్కువ ఆక్సిజన్ గ్రహిస్తాయి.

ఈ టర్క్వాజూ అక్వేరియం ఇస్తాంబుల్‌లోని ఫోరమ్ షాపింగ్ మాల్‌లో నిర్మించారు. టైగర్ షార్క్‌లు, పిరాన్హాలున్న ఈ అక్వేరియంలో 10 వేల జలచరాలు 30 ప్రదర్శన ట్యాంకుల్లో కనిపిస్తాయి. జర్మనీలోని బెర్లిన్ ఆక్వాడోమ్ అక్వేరియం చాలా విభిన్నమైనది. స్థూపాకార నిర్మాణంలో 11 మీటర్ల వ్యాసంతో, 25 మీటర్ల ఎత్తులో నిర్మించిన దీని మధ్య గుండా మరో అద్దాల లిఫ్ట్ ద్వారా మనం పైభాగానికి చేరుకోవచ్చు. 2,600 జలచరాలున్నాయి. అట్లాంటాలోని జార్జియా అక్వేరియం ప్రత్యేకత ఓషియన్ వాయేజర్. రెండున్నర కోట్ల లీటర్ల నీరున్న ట్యాంకుల్లో వేల్ షార్క్‌లు మనల్ని నోరెళ్లబెట్టిస్తాయి. ఇంగ్లండ్ హల్‌లోని డీప్ ఆక్వేరియం సముద్రం అట్టడుగున ఉన్నట్టు అనిపిస్తుంది. దీన్ని సబ్‌మేరియం అని కూడా అంటారు. ఏడు రకాల షార్క్ జాతులతో పాటు 3,500 రకాల జలచరాలు ఉన్నాయి. సముద్ర జల చరాల పరిశోధనకు ఇక్కడ ప్రత్యేకమైన ప్రయోగశాలలున్నాయి.

మన దేశంలోను చూడదగ్గ అక్వేరియంలు చాలానే ఉన్నాయి. ముంబైలోని తారాపోర్‌వాలా అక్వేరియం మెరీన్ డ్రైవ్‌కు దగ్గరల్లో ఉంటుంది. 1951లో మహారాష్ట్ర ప్రభుత్వం దీన్ని ప్రారంభించింది. సముద్ర, మంచినీటి జలచరాలు ఇక్కడ కనిపిస్తాయి. లక్ష ద్వీపాల్లో కనిపించే వాటితో పాటు పెద్ద పెద్ద తాబేళ్లు, భయంకరమైన పిరాన్హాల్ని చూడొచ్చు. నందన్‌కానన్ జూ అక్వేరియమూ పెద్దదే. సముద్ర జలావాసాన్ని పరిరక్షించేందుకు దీన్ని ప్రారంభించారు. పశ్చిమ బెంగాల్‌లోని దిఘా మెరీన్ అక్వేరియం చూడదగ్గదే. రామేశ్వరంలోని సీ వరల్డ్ అక్వేరియంలో ఆక్టోపస్‌లు, పారట్ ఫిష్, రాబిట్ ఫిష్, సీ స్క్విడ్, సీ లోటస్ వంటి వాటిని చూడొచ్చు. పోర్ట్ బ్లెయిర్‌లోని ది అక్వేరియంలో అరుదైన కోరల్ రకాలతోపాటు 350 జాతుల జీవాల్ని సందర్శించొచ్చు. అండమాన్ నికోబార్ దీవుల్లో మాత్రమే కనిపించే జీవజాతులను వీటిలో ఉంచారు. జమ్ములో కూడా అక్వేరియం ఉంది. ఇక్కడి బాగ్ ఇ బాగ్ అక్వేరియం దేశంలోనే పెద్ద అండర్ గ్రౌండ్ ఆక్వేరియం. 24 అక్వేరియం గుహ మార్గాల గుండా 400 రకాలకు చెందిన జలచరాల్ని చూడొచ్చు. బెంగళూర్‌లోని ప్రభుత్వ అక్వేరియం 1983లోనే తెరిచారు. కిస్సింగ్ గౌరామి, బ్యూనస్ ఎయిర్స్ టెట్రా, సర్పెంట్ టెట్రా ఇక్కడ కనువిందు చేస్తాయి. ఎడారి ప్రాంతమైన రాజస్థాన్‌లోని మౌంట్ అబూలోను అక్వేరియం ఉంది. ఇక్కడి దాట్లా సీ వరల్డ్ ఆక్వేరియం దేశంలోనే అతి పెద్దదిగా గుర్తింపు పొందింది. ప్రపంచ నలుమూలలకు చెందిన జలచరాలు ఇక్కడ ఉన్నాయి. చెన్నైలోని మెరీన్ అక్వేరియం కూడా పెద్దదే. సింగపూర్ శైలిలో నిర్మించిన ఈ అక్వేరియంలో లైటింగ్ సిస్టమ్ ప్రత్యేకంగా ఉంటుంది. 18 భారీ ట్యాంకుల్లో వేలాది జలచరాలున్నాయి. మన వైజాగ్‌లోను మత్స్య దర్శిని అక్వేరియం ఉంది. 1994లో ప్రారంభించిన ఈ అక్వేరియంలో మలేషియా, సింగపూర్‌లకు చెందిన జలచరాలూ కనువిందు చేస్తాయి. 18 ట్యాంకుల్లో సముద్ర, మంచి నీటి జలచరాలను వీక్షించొచ్చు. బటర్ ఫ్లై, లాంగ్ హార్న్ కౌ, పీకాక్ వ్రాస్సే, మూరిష్ ఐడల్, డామ్సెల్స్, ఏంజెల్స్, ఎలక్ట్రిక్ రే, పోర్కుపైన్, స్వీట్ లిప్స్ వంటి ఎన్నో రకాల చేపల్ని చూడొచ్చు.



ఫ్రీ విల్

అక్వేరియాల వల్ల నష్టమూ జరుగుతోంది. అంతుపొంతూ లేని అక్రమ వేటతో చాలా జీవులు అంతరించిపోతున్నాయి. అత్యంత అరుదైన, అంతరించిపోయే దశలో ఉన్న వాటికి మార్కెట్‌లో అధిక ధర, డిమాండ్ ఉంది. ఇంటర్‌నెట్ ద్వారానే చేపల్ని విక్రయిస్తున్న సైట్ల సంఖ్య 5 లక్షల వరకు ఉందంటే ఎంత భారీ స్థాయిలో అక్వేరియం చేపల వాణిజ్యం జరిగిపోతుందే అర్థం చేసుకోవచ్చు. అరుదైన జీవాల్ని కొని అక్రమ వేటను ప్రోత్సహించకండని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు. 'ఫ్రీ విల్లీ'లోని చిత్రం మాదిరి వాటిని బయటపడేలా చేయమని హాబీయిస్ట్‌లను, పెట్ యజమానులకు విన్నవించుకుంటున్నారు. ఫిలిప్పీన్స్, ఇండియా, జావా, శ్రీలంక, మాల్దీవులు, మలేషియా, ఇండోనేషియా తదితర జలచర స్వర్గాలైన సముద్ర ప్రాంతాల్లో అక్వేరియం చేపల వేట ఎక్కువగా ఉంటోంది. బ్రీడింగ్ కేంద్రాల ద్వారా అక్వేరియం చేపలను వృద్ధి చేస్తున్నారని చెబుతున్నా, వాస్తవానికి కోట్ల చేపలు నదీ, సముద్ర జలాల నుంచే వేటాడబడుతున్నాయి. చేపలను తేలిగ్గా పట్టేందుకు సైనేడ్‌ను జలాల్లోకి వదిలి వాటిని స్టన్ చేసి వేటాడుతున్నారని వెలుగులోకి వచ్చింది.

కాస్త జాగ్రత్త

ఇంట్లో అక్వేరియంలను పెట్టుకుంటే మాత్రం కాస్త జాగ్రత్తగా ఉండాల్సిందే. అక్వేరియం ట్యాంక్ తేలిగ్గా పరాన్నజీవులు, సూక్ష్మజీవులకు ఆవాసంగా మారే అవకాశం ఎక్కువ. ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోకపోతే చేపలతో పాటు మనకు ప్రమాదమే. చేపల ట్యాంకులను శుభ్రపరిచేటపుడు ఏవైనా గాయాలైనా, చర్మం పగుళ్ల ద్వారా, శరీరం లోపలికి వెళ్లేలా ట్యాంకు నీరు వెళ్లినా ఆ సూక్ష్మ జీవుల ఉన్నట్టయితే అవి తేలిగ్గా మనలోకి ప్రవేశిస్తాయి, ఒక్కోసారి చేపలు కరిచినా ప్రమాదమే. చేపల ద్వారా ఫిష్ టీబీతో పాటు, విబ్రియో ఇన్‌ఫెక్షన్స్ సోకే అవకాశం ఉంది. ఇవి ప్రాణాంతకం. మిగతా జంతువుల నుంచి సంక్రమించే సాల్మోనెల్లా కూడా చేరొచ్చు. స్ట్రెప్టోకాక్కస్ ఇనై కలుగజేసే మ్యాడ్‌ఫిష్ వ్యాధి కూడా గాయాల ద్వారా ప్రవేశించొచ్చు. సూక్ష్మమైన రెడ్ టైడ్ ఆర్గనిజమ్స్, ఫైస్టేరియా పిక్సిసిడా అనే జీవి ట్యాంకుల్లోకి చేరినట్టయితే చాలా ప్రమాదమే. మెమరీ లాస్‌తో పాటు కిడ్నీ సమస్యలు, నార్కోసిస్ వంటి సమస్యల్ని కలుగజేసే దీన్ని బయోహజార్డ్‌గా గుర్తించారు. కేవలం ప్రత్యేక ల్యాబ్‌ల్లో మాత్రమే వీటితో పరిశోధిస్తారు.

మనతో పాటు చేపలకు సమస్యలున్నాయి. పంజరంలో పక్షి పరిస్థితికి వీటికీ తేడా ఉండదు. ఫిష్ బౌల్‌లోంచి ఎప్పుడు ఎగిరిపోదామా అనే గోల్డెన్ ఫిష్‌ది విన్యాసం కాదు. దాని ప్రపంచం చాలా ఇరుకై ఊపిరాడని జీవన్మరణ సమస్య. మరీ చిన్న చిన్న ఆక్వేరియంలు చేపల్ని ఒత్తిడికి గురిచేస్తాయి. కొన్ని చేపలు మనల్ని చూడగానే అద్దం ముందుకు దూసుకువచ్చి ఆగ్రహం ప్రదర్శించడానికి కారణాల్లో ఇది ఒకటి అని తేలింది. హాయిగా విహరించేలా అనుకూలమైన వాతావరణం ఉన్న ట్యాంకులనే రూపొందించుకోవాలి. సాధ్యమైనంత పెద్ద ట్యాంకులను వినియోగిస్తే మంచిది.

మనదేశంలో అంతరించిపోయే దశలో ఉన్న కేరళకు చెందిన మీనాలు జర్మనీ వీధుల్లో విరివిగా అమ్ముడవుతున్నాయి. చాలా వరకు చేపలు రవాణాలోనే చనిపోతున్నాయని, అక్వేరియాల్లో ఏడాదిలోపునే మరణిస్తున్నాయని లెక్కలు. సైట్స్ అనే అంతర్జాతీయ ట్రీటీ ద్వారా ఈ అక్రమ వేటకు వ్యతిరేకంగా దేశాలు సంతకాలు చేసినా, వాటిని గట్టిగా పట్టించుకునే చట్టాలు లేవు. ప్రపంచానికి భారీ స్థాయిలో అక్వేరియం చేపల్ని అందిస్తున్న మనదేశంలో అయితే దాని జాడ అంతంత మాత్రమే. మన దేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కోరల్ రీఫ్స్‌తో పాటు, తీవ్ర మనుగడ ప్రమాదంలో పడిన 22 చేపలు అక్వేరియంలకు తరలిపోతున్నాయి. ఇలాంటి అపరిమిత వేటల వల్ల జీవజాల చక్రం ధ్వంసం అవుతోంది. జపాన్‌లో రాక్షసంగా డాల్ఫిన్ల టైజి వేట సాగిపోతోంది. జంతు, మత్స్య ప్రదర్శన శాలల సంఘం వూజా దీనికి వ్యతిరేకంగా ఉద్యమించింది. అక్కడి నుంచి వచ్చే డాల్ఫిన్లను కొనగూడదని తీర్మానించింది. హవాయి, అమెరికాల్లో చిన్న సైజు అక్వేరియంల నిర్వహణను నిరుత్సాహపరుస్తున్నారు.

'ఫైండింగ్ నెమో' సినిమా విడుదలయ్యాక క్లౌన్ ఫిష్ డిమాండ్ ఎక్కువైపోయింది. కోరల్ రీఫ్స్‌లో పుట్టిన తర్వాత సుమారు 400 కిలోమీటర్లు ప్రయాణించాక గానీ ఇవి వాటి జీవావసరాలకు పనికొచ్చే అనిమోన్ సముద్ర మొక్కలను చేరుకోలేవు. అక్కడే అవి హాయిగా జీవించే స్థితికి వెళతాయి. 90 శాతం చేపలు మార్గమధ్యంలో వివిధ కారణాల వల్ల చనిపోతాయి. మిగతా 10 శాతం మిగిలే వాటిని అక్వేరియంల కోసం వేటాడుతున్నారు. 'ఫైండింగ్ డోరీ' చిత్రం వచ్చే ఏడాదిలో విడుదలవబోతోంది. దీనిలో బ్లూ ట్యాంగ్ చేప పాత్రధారి. 'ఫైండింగ్ నెమో'లానే ఇది కూడా ఆకట్టుకుంటే బ్లూ ట్యాంగ్‌ల డిమాండ్ పెరిగి వాటికి ముప్పు వాటిల్లుతుందని జలచర ప్రేమికులు తలలు పట్టుకుంటున్నారు. వారికా

అవకాశం ఇవ్వకుండా హాబీయిస్ట్‌లు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

ఆఫ్రికన్ సిక్లిడ్స్, కిల్లి, జర్మన్ బ్లూ ర్యామ్, మేల్ బెట్టా, ఎండ్లర్స్, బోస్‌మన్ రెయిన్‌బో, ఫ్యాన్‌టైల్ గప్పీ, పారెట్ చేపలు, రీగల్ ట్యాంగ్, క్లోరల్ బ్యూటీ, ఫ్లేమ్ ఏంజెల్, కోయి, మూరిష్ ఐడల్, లయన్, డిస్కస్, మాండరిన్ చేపలు అత్యంత అబ్బురమైన రంగులతో ఉంటాయి. రంగులు వివిధ రూపాల్లో వాటి శరీరాలపై తళుకులీనుతుంటాయి. వందల రూపాయల నుంచి లక్షల ఖరీదు చేసే పెంపుడు చేపలున్నాయి. ఫ్లవర్ హార్న్ సిక్లిడ్ అయిన 'గోల్డెన్ మంకీ' చేప అయితే మలేషియా ప్రదర్శనలో రికార్డు స్థాయిలో 6 లక్షల డాలర్లకు అమ్ముడుబోయింది. ప్రత్యేక బ్రీడర్లలో రకరకాల వర్ణాలు, ఆకృతుల్లో చేపల్ని సృష్టించే సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. సముద్ర జలాల నుంచి, నదులు, సరస్సుల నుంచి వేటాడి పట్టడం కన్నా ఇలా బ్రీడర్ల ద్వారా పెంపుడు చేపల ఉత్పత్తిని భారీ స్థాయిలో చేపడితే చాలా వరకు నష్టం ఉండదు. ఏదేమైనా అక్వేరియాల వల్ల మనం ఎంత సంతోషాన్ని, ఆహ్లాదాన్ని అనుభూతి చెందుతున్నామో, వాటి వల్ల జలచరాలకు ముప్పు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటే అక్వేరియం కల్చర్ మంచి హాబీనే అవుతుంది. ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని ఇస్తుంది. పబ్లిక్ అక్వేరియంలకు పిల్లలతో పాటు మీరూ వెళ్లి జల లోక విహారం చేసి రండి. జల లోకపు మిత్రులతో మరింత దగ్గరవండి.

అజయ్ కుమార్ వారాల

9502395077

అంకుశం

-శిరంసెట్టి కాంతారావు
9849890322

◆ కథ

సమయం ఉదయం తొమ్మిది గంటలు..

పాల్వంచ ఫెర్టిలైజర్స్ కంపెనీ సైరన్ "కార్మికులారా! రండహో" అన్నట్టు మ్రోగింది. జనరల్ షిఫ్ట్ వాళ్ళంతా రకరకాల వాహనాల మీద వస్తున్నారు. సరిగ్గా అప్పుడే "గిరిజన కార్మికుడికి న్యాయం చెయ్యాలి", "వెంటనే ఆఫీస్ సైడ్‌కి ట్రాన్స్‌ఫర్ చెయ్యాలి" అంటూ.. కంపెనీ మెయిన్ గేట్ దగ్గర్లోవున్న కొమరం భీమ్ విగ్రహం ముందు రోడ్డుకు అడ్డంగా నిల్చున్న కొంతమంది చేస్తున్న నినాదాలతో ఒక్కసారిగా ఆ పరిసరాలు హోరెత్తిపోసాగాయి. దాంతో ఉలిక్కిపడిన సెక్యూరిటీ సిబ్బంది పరుగున వచ్చి వాళ్ళను చుట్టుముట్టారు. డ్యూటీకి వెళుతున్న వాళ్ళంతా ఆగిపోయి "పిట్టన్న విషయంలోనే కావచ్చు!" అనుకోసాగారు. "అంగవికలుడైన గిరిజన కార్మికుడికి వెంటనే న్యాయం చేయాలి" అనుకుంటూ వున్నవాళ్ళకు తోడుగా మరి కొంత మంది గిరిజనులు చేరవచ్చారు. అంతమంది గిరిజనులక్కడ గుమిగూడడం చూసిన కార్మికులు దగ్గరికొచ్చి "ఏం జరిగింది" అంటూ పిట్టన్ననే అడిగారు. అసలు జరిగిందేమిటో నలుగురికి తెలియడమే మంచిదనుకున్న పిట్టన్న తన చుట్టూ మూగి వున్న తోటి కార్మికుల వంక చూస్తూ చెప్పడం మొదలుపెట్టాడు.

¤ ¤ ¤

పిట్టన్న వాళ్ళకున్న ఇరవై ఎకరాల భూమి ఫెర్టిలైజర్స్ కంపెనీలో కలిసిపోయింది. భూములు కోల్పోయిన వాళ్ళందరికీ కంపెనీలో ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పిన సర్కార్ ఆ తరువాత మాట తప్పింది. పదవ తరగతి వరకు చదువుకున్న పిట్టన్న చేతులు ముడుచుకుని కూర్చోకుండా భూములు కోల్పోయిన వాళ్ళందరినీ కూడేసి రకరకాలుగా ఆందోళనలు చేశాడు. ఆ ఆందోళనల ఫలితంగా దిగివచ్చిన ఫెర్టిలైజర్స్ కంపెనీ యాజమాన్యం భూములు కోల్పోయిన వాళ్ళందరికీ ఉద్యోగాలిచ్చింది.

పోరాడి ఉద్యోగం సంపాదించుకున్న పిట్టన్న, ఉద్యోగం చేసుకుంటూనే ప్రైవేట్‌గా డిగ్రీ చదివాడు. తోటి గిరిజన కార్మికుల సంక్షేమం కోసం యాజమాన్యంతో రాజీలేకుండా పోరాడుతున్నాడు. మిగతా యూనియన్ల నాయకులకు పిట్టన్న కారణంగానే గిరిజన కార్మికులెవ్వరూ తమ దగ్గరికి రావడం లేదన్న ద్వేషాన్ని రగిలించింది. ఎక్కడ వీలైతే అక్కడ పిట్టన్నను తొక్కిపడెయ్యడానికి వాళ్ళంతా కాచుక్కూర్చున్నారు.

¤ ¤

కాల ప్రవాహంలో మరో ఏడు వందల ఇరవై రోజులు కొట్టుకుపోయాయి. ఈ మధ్యకాలంలో పిట్టన్న పేరు గిరిజన కార్మికులతో పాటు గిరిజనేతర కార్మికుల్లో కూడా చొచ్చుకుపోయింది. మిగతా యూనియన్ల నాయకులకు అది మరింత కోపాన్ని తెప్పించింది. ఇక లాభం లేదనుకున్న ఆ ఇతర యూనియన్ల నాయకులంతా ఓరోజు సమావేశమై పిట్టన్నను మట్టుపెట్టడానికి పథకం వేశారు. ఓ రోజు ఉదయం ఐదు గంటలకు పిట్టన్న బైక్ మీద ఫస్ట్ షిఫ్ట్ డ్యూటీకి వెళుతున్నాడు. బైక్ భగత్ సింగ్ సెంటర్ నుండి కుడి పక్కకు తిరిగి కంపెనీ వైపునకు పోతుంది. అదే సమయంలో కంపెనీ వైపు నుండి వేగంగా వస్తున్న టిప్పర్ ఒకటి, బైక్‌ను గుద్దేసి ఆగకుండా వెళ్ళిపోయింది.

టిప్పర్ తగలడంతోనే బైక్ మీద నుండి బంతి మాదిరిగా గాల్లోకి లేచిన పిట్టన్న అంత దూరాన నడిరోడ్డు మీద స్పృహ కోల్పోయాడు. సరిగ్గా అదే సమయంలో కంపెనీ వైపు నుండి వచ్చిన ఇంకో టిప్పర్ పిట్టన్న ఎడమ కాలును నుజ్జునుజ్జుగా తొక్కుకుంటూ వెళ్ళిపోయింది. ఈ మొత్తం వ్యవహారం ఐదే ఐదు నిమిషాల్లో ముగిసిపోయింది. మరో పది నిమిషాలు, పావు గంట తరువాత డ్యూటీకి వస్తున్న కార్మికులు, రక్తం మడుగులో పడివున్న పిట్టన్నను గుర్తించి వెంటనే కంపెనీ అంబులెన్స్‌కి ఫోన్ చేశారు. ఆగమేఘాల మీద వచ్చిన అంబులెన్స్ పిట్టన్నను ఎక్కించుకొని కొత్తగూడేనికి తీసుకెళ్ళింది. అంబులెన్స్‌లో నుండి అతణ్ణి దించక ముందే "ఈ కేస్ మేం

తీసుకోకూడదు మీరు వెంటనే గవర్నమెంట్ హాస్పటల్‌కి తీసుకుపోండి!" అంటూ గేట్‌లో నుండే వెనక్కి పంపించారు ప్రైవేట్ హాస్పిటల్ వాళ్ళు. గవర్నమెంట్ హాస్పిటల్లో ఫార్మాలిటీస్ అన్నీ పూర్తై అడ్మిట్ చేసుకునే సరికి పక్కా రెండు గంటలు పట్టింది. ఆ తరువాత మరో గంటకు వచ్చిన సంబంధిత డాక్టర్ "ఈ కేస్ ఇక్కడ లాభంలేదు వెంటనే ఖమ్మం గానీ, హైదరాబాద్ గానీ తీసుకుపోండి! ఆలస్యం చేస్తే బాడీ మొత్తం పాయిజన్ అవుతుంది. దాంతో అసలు ప్రాణానికే ముప్పురావచ్చు." అంటూ చేతులు దులిపేసుకున్నాడు. ఇంతలో పిట్టన్న భార్య, అన్నదమ్ములు రెండు ఆటోలు వేసుకుని కొత్తగూడెం హాస్పిటల్ దగ్గరికి చేరుకున్నారు. అటు నుండి అటే ఖమ్మం బయలుదేరుదామనుకుంటే "కంపెనీ అంబులెన్స్ ఖమ్మం దాకా రావడానికి పర్మిషన్ లేదు. మీరేదైనా ప్రైవేట్ అంబులెన్స్ మాట్లాడుకొని వెళ్ళడమే." అంటూ అంబులెన్స్ సిబ్బంది చేతులెత్తేశారు.

దాంతో ఇంక చేసేదేంలేక అప్పటికప్పుడు ప్రైవేట్ అంబులెన్స్ మాట్లాడిన తోటికార్మికులు, తాము ఆగిపోయి కుటుంబ సభ్యులను ఎక్కించి ఖమ్మం మమత హాస్పిటల్‌కి పంపించారు. పిట్టన్నను చూసిన వెంటనే "మేం ఫస్ట్ ఎయిడ్ చేసి పంపిస్తాం గాని, మీరు వెంటనే హైదరాబాద్ నిమ్స్‌కి తీసుకుపోతే మంచిది." అంటూనే ఫస్ట్ ఎయిడ్ మొదలుపెట్టారు మమత హాస్పిటల్ డాక్టర్లు. గంట తరువాత అదే ప్రైవేట్ అంబులెన్స్‌లో పిట్టన్నను ఎక్కించుకున్న కుటుంబ సభ్యులు నాలుగు గంటల్లో హైదరాబాద్ నిమ్స్‌లో చేర్పించారు. పిట్టన్నను చూడ్డంతోనే "వెంటనే ఆపరేషన్ చేసి కాలు తీసెయ్యాలి. లేకుంటే ప్రాణానికే ప్రమాదం." అంటూ కొత్తగూడెం డాక్టర్లు చెప్పిన విషయాన్నే నిమ్స్ డాక్టర్లు కూడా ఖాయం చేశారు. ఆ మాటలను విన్న కుటుంబ సభ్యులు ఏ నిర్ణయం తీసుకోవాలో అర్థంకాక కొట్టుమిట్టాడసాగారు. వాళ్ళ పరిస్థితిని గమనించిన పిట్టన్న "ఇంక ఆలస్యం అనవసరం. ఆపరేషన్ కానివ్వండి సార్!" అంటూ ధైర్యంగా తన అంగీకారాన్ని తెలియజేశాడు. పేషెంట్ అంగీకారాన్ని తీసుకున్న డాక్టర్లు చకచకా ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేశారు. ఐదు గంటల ఆపరేషన్ తరువాత పిట్టన్న కాలు మోకాలు పైకి తీసేశారు.

¤ ¤ ¤

ఇరవై రోజుల తరువాత హాస్పిటల్ నుండి డిశ్చార్జై ఇల్లు చేరాడు పిట్టన్న. లాస్ ఆఫ్ పే మీద రెండు నెలలు సిక్ లీవ్ తీసుకుని ఇంట్లోవున్న పిట్టన్న, మరోసారి హైదరాబాద్ హాస్పిటల్‌కి వెళ్ళి చెక్ చేయించుకున్నాడు. చెక్ చేసిన డాక్టర్లు ఫిట్ సర్టిఫికెట్ ఇచ్చారు. డ్యూటీలో జాయిన్ అవుదామని ఫిట్ సర్టిఫికెట్ తీసుకుని వాకర్‌తోనే కంపెనీకి వెళ్ళిన పిట్టన్న, కంపెనీ డాక్టర్‌తో ఫిట్ సర్టిఫికెట్ మీద కౌంటర్ సైన్ చేయించుకుని నేరుగా జి.యం. పర్సనల్ ఆఫీస్‌కి వెళ్ళాడు.

"సార్! పర్సనల్ ప్రాబ్లమ్స్ అన్నీ పన్నెండున్నర తరువాతే చూస్తారు. అప్పటి దాకా మీరక్కడ కూర్చోండి!" అంటూ ఆ పక్కనేవున్న ఓ బల్ల చూపించాడు ఆఫీస్ మెసెంజర్. "ఈ రూల్ ఎప్పట్నుంచి!?" అనుకున్న పిట్టన్న వెళ్ళి ఆ బల్లమీద కూర్చున్నాడు. ఆ బల్లకు దగ్గర్లోనే తన టేబుల్ మీదున్న కంప్యూటర్లో గేమ్ ఆడుకుంటున్న జి.యమ్. సెక్రటరీ వచ్చిందెవరోనని కనీసం తల తిప్పి కూడా చూడలేదు. అర గంట గడచినా జి.యమ్. పర్సనల్ రాలేదు. సెక్రటరీ కంప్యూటర్ స్క్రీన్ మీద నుండి తల తిప్పలేదు. చూసీ చూసీ విసుగొచ్చిన పిట్టన్న తన ముందున్న వాకర్ని కావాలనే గట్టిగా ఎత్తిపడేశాడు. ఆ శబ్దానికి ఉలిక్కిపడ్డ సెక్రటరీ కంప్యూటర్ మీద నుండి అప్పుడు తల తిప్పి పిట్టన్న వంక చూశాడు. చూడ్డంతోనే పిట్టన్న కుంటి కాలు కనిపించడంతో గిల్టీగా ఫీలైన సెక్రటరీ "సారీ! నేనేదో ధ్యాసలో వుండి పట్టించుకోలేదు. సార్ రాగానే అందరికన్నా నిన్నే ముందు పంపిస్తా గాని అసలింతకూ నీ కాలుకేమైంది?" అంటూ సానుభూతిగా అడిగాడు.వివరించాడు పిట్టన్న. "అయ్యో అలాగా! ఇప్పటిదాకా నాకీ విషయమే తెలియదు." అన్నాడు సెక్రటరీ. ఇంతలో జి.యమ్.తో పనుందంటూ ఏడెనిమిది మంది కార్మికులొచ్చారు. మరో అర గంట తరువాత జి.యమ్. వచ్చాడు. చెప్పినట్టుగానే అందరికన్నా ముందు పిట్టన్ననే లోపలికి పంపించాడు సెక్రటరీ. పిట్టన్నను చూడగానే "కాలెలా వుంది?" అంటూ క్యాజ్‌వల్‌గా అడిగాడు జి.యమ్. "ఫరవా లేదు. డాక్టర్లు లైట్ జాబ్‌కి రికమెండ్ చేస్తూ లెటర్ ఇచ్చారు." అంటూ ఫిట్ సర్టిఫికెట్ తీసి జి.యమ్. చేతికందించాడు పిట్టన్న.

పావుగంట పాటు సర్టిఫికెట్‌ను పరిశీలించిన జి.యమ్. పర్సనల్ "పాపం పిట్టయ్యా! నీకు మాత్రం చాలా అన్యాయం జరిగింది. కనీసం ఆ వెహికల్ ఏదో దొరికినా బావుండేది. ఫిజికల్‌గా ఇంత లాసైనందుకు ఎంతో కొంత ఫైనాన్సియల్ బెనిఫిట్ అన్నా వచ్చేది." అంటూ మోయలేనంత సానుభూతిని వర్షించాడు. "ఒక్కోసారి అట్లా జరుగుతుందంతే" అంటూ బదులిచ్చాడు పిట్టన్న జి.యమ్.కళ్ళలోకి చూస్తూ. పిట్టన్న రాసుకున్న కవరింగ్ లెటర్ మీద ఏదో కామెంట్ రాసిన జి.యమ్. పర్సనల్ "ఈ లెటర్ తీసుకెళ్ళి జి.యమ్.వర్క్స్‌ని కలవండి." తిరిగి ఇస్తూ అన్నాడు.

లెటర్ తీసుకున్న పిట్టన్న "సార్! ఈ కాలుతో బాయిలర్ పైకెక్కి డ్యూటీ చెయ్యడం కుదరదు. అంతో ఇంతో చదువుకున్నవాణ్ణి కాబట్టి ఎక్కడన్న ఆఫీస్‌లో టేబుల్ వర్క్ ఇవ్వండి చేస్తాను." అంటూ రిక్వెస్ట్ చేశాడు. పిట్టన్న రిక్వెస్ట్‌ను విన్న వెంటనే "అసలిప్పటికే మినిస్టీరియల్ స్టాఫ్ ఎక్కువయ్యారని హైదరాబాద్ ఆఫీస్ వాళ్ళు గొడవ చేస్తున్నారు. అయినా నీది జన్యున్ కేస్ కాబట్టి నాకూ కన్సిడర్ చెయ్యాలనే వుంది. కాకపోతే నీకొక్కడికిస్తే మిగతా యూనియన్ నాయకులు 'మా క్యాండెట్స్ కూడా చాలామంది చాలా రకాల జబ్బులతో బాధపడుతున్నారు. మావాళ్ళ కేస్‌లు కూడా కన్సిడర్ చెయ్యండి.' అంటూ మా పీకల మీద కత్తిపెట్టి కూర్చుంటారు. అందుకే నిజంగా అవసరమున్న మీలాంటి వాళ్ళకు సాయం చెయ్యాలని వున్నా చెయ్యలేకపోతున్నాం. సారీ!" అంటూ ఎంతో లౌక్యంగా మాట్లాడాడు జి.యమ్. పర్సనల్.

"మీరెన్నన్నా చెప్పండి సార్! నేను మాత్రం ఈ కాలుతో పైకెక్కి ఆ బాయిలర్ల మీద పని చెయ్యలేను." అంటూ గట్టిగానే చెప్పాడు పిట్టన్న. "సరే చూద్దాం! ముందు మీరీ లెటర్ తీసుకుని జి.యమ్. వర్క్స్ దగ్గరికెళ్ళండి. మీకక్కడ ఆయనే ఏదో ఒక సూటబుల్ ప్లేస్ చూపిస్తాడు. కావాలంటే నేను కూడా ఆయనకు ఫోన్ చేసి పర్సనల్‌గా చెబుతాను." అంటూనే తరువాత వాళ్ళను పంపించమన్నట్టు బయటవున్న సెక్రటరీకి కాలింగ్ బెల్ కొట్టాడు జి.యమ్.పర్సనల్. ఇక తప్పదన్నట్టు మెల్లగా లేచి బయటకొచ్చాడు పిట్టన్న.

¤ ¤ ¤

"సారీ పిట్టన్నా! వ్యక్తిగతంగా నీకు సాయం చెయ్యాలని వున్నా చెయ్యలేని పరిస్థితి మాది. అయినా ఆల్ సెక్షనల్ హెడ్స్‌ను నీ ముందే పిలిపించి మాట్లాడుతానుండు వాళ్ళేం చెబుతారో విందువు గాని.." అంటూ ఇంటర్‌కాంలో ఫోన్లు చేసి వెంటనే తన చాంబర్‌కి రమ్మన్నాడు జి.యమ్.వర్క్స్. "మీరు డెసిషన్ తీసుకొని పంపిస్తే వద్దనేదెవరు సార్!" జి.యమ్. వర్క్స్ కావాలనే ఏదో డ్రామా ఆడుతున్నాడన్న విషయం అర్థమైపోతుంటే వస్తున్న కోపాన్ని దిగమింగుకుంటూ అన్నాడు పిట్టన్న.

"లేదు.. లేదు.. ఏదైనా వాళ్ళిష్టంతోనే చెయ్యాలి తప్ప నా అభిప్రాయం వాళ్ళ మీద రుద్దకూడదు." అంటూ అతనింకేదో మాట్లాడుతుండగానే హెచ్.ఒ.డి.లందరూ వచ్చేశారు. వాళ్ళంతా పిట్టన్నను చూస్తూనే "ఈ తద్దినాన్ని మన మీద రుద్దడానికి పిలవలేదు కదా?" అనుకుని ముఖాలు ముడుచుకుంటూ జి.యమ్. ఎదురుగా కూర్చున్నారు. ఒకరిద్దరు తప్ప మిగతా హెచ్.ఒ.డిలు అందరూ వచ్చారని నిర్ధారించుకున్న జి.యమ్. వర్క్స్ "చూడండీ! మన పిట్టన్నకు చాలా ఘోరం జరిగిపోయింది. పోయిన కాలును మనమెలాగూ తీసుకురాలేం. ఆ కాలుతో తానిక బాయిలర్ పైకెక్కి పని చేయలేనంటున్నాడు. తను చదువుకున్నవాడే కాబట్టి ఏ టేబుల్ వర్కో ఇవ్వడం మన ధర్మం. మీలో ఎవరో ఒకరు అతణ్ణి తీసుకుని పేపర్ వర్క్ చేయించుకోండీ!" నిజానికి మీరెవ్వరూ అతణ్ణి తీసుకోనవసరం లేదు అన్న ఓ సంకేతాన్ని ఆపద్ధర్మంగా అందజేస్తూ తెలివిగా విషయాన్ని వెల్లడించాడు.

సూది దూరేంత సందిస్తే చాలు ఏనుగును గూడా లాక్కుపోయే తెలివితేటలున్న హెచ్.ఒ.డి.లంతా జి.యమ్. సంకేతాన్ని సునాయాసంగా అందిపుచ్చుకుని "నిజంగా ఈ పరిస్థితిలో మీరన్నట్టు పిట్టన్నకు టేబుల్ వర్క్ ఇవ్వడం న్యాయమే. మాక్కూడా ఇవ్వాలనే వుంది. కాకపోతే ఇప్పటికే మా సెక్షన్స్‌లో క్లరికల్ స్టాఫ్ ఇబ్బడిముబ్బడిగా వున్నారు. కాబట్టి సారీ సార్!" అంటూ ప్రతి ఒక్కరూ పిట్టన్నను నాకొద్దంటే నాకొద్దని సున్నితంగా తిరస్కరించారు.

"అందరూ అట్లాగే అంటే ఎట్లా మరి?" నీళ్ళు నమిలినట్టుగా మాట్లాడాడు జి.యమ్. వర్క్స్. "ఏమో సార్! మీరేమన్నా చేసుకోండది. మాకు మాత్రం అవసరం లేదు." అంటూ ఎవరి మానాన వాళ్ళు లేచిపోయారు. వాళ్ళంతా వెళ్ళిపోయిన తరువాత పిట్టన్న వంక తిరిగిచూస్తూ "ఎలా మాట్లాడారో చూశావు గదా? ఎవ్వరూ వద్దంటుంటే మరి నేను మాత్రం ఏం చెయ్యగలను చెప్పు?" అంటూ తనూ మెల్లగా తప్పుకోవాలన్నట్టు మాట్లాడాడు జి.యమ్. వర్క్స్.

"అదంతా నాకు తెలియదు సార్! నేనైతే బాయిలర్ మీదికి పోయి పని చేయటమనేది జరిగేది కాదు. మీరేంజేసుకుంటారో ఏమో నేను మాత్రం రోజూ వచ్చి మీ ఆఫీస్ ముందు కూర్చొని పోతాను." వున్న విషయం తెగేసినట్టు చెప్పి మెల్లగా లేచి బయటికి నడిచాడు పిట్టన్న.

¤ ¤ ¤

మరునాడు ఉదయం పది గంటలకు తను చెప్పినట్టే వచ్చి జి.యమ్.వర్క్స్ ఆఫీస్ ముందు కూర్చున్నాడు పిట్టన్న. పదిన్నరకు ఆఫీస్‌కి వచ్చిన జి.యమ్. వర్క్స్ పిట్టన్నను చూస్తూనే "లోపలికి రా!" అంటూ తన చాంబర్లోకి వెళ్ళాడు. అతని వెనుకనే లోపలికెళ్ళిన పిట్టన్న చేతికి ఓ కాగితం ఇచ్చిన జి.యమ్. "నువ్వెళ్ళి కెమికల్ డివిజన్‌లో వుండే రామిరెడ్డి డి.ఈ.కి రిపోర్ట్ చెయ్యి." అంటూ నిన్న హెచ్‌వోడీల మీటింగ్‌కి అటెండ్ కాని కెమికల్ డివిజన్ ఇన్‌చార్జి డి.ఈ. దగ్గరికి పంపించాడు. మెల్లగా కెమికల్ డివిజన్‌కి వెళ్ళి జి.యమ్. ఇచ్చిన లెటర్ డి.ఈ. రామిరెడ్డి చేతికిచ్చాడు పిట్టన్న. ఆ లెటర్ చూస్తూనే "అరె.. నేను నిన్న ఫోన్‌లోనే వద్దని చెప్పాను కదా. మళ్ళీ నిన్నెందుకు పంపించాడు?" అంటూ విసుక్కున్న డి.ఈ. "మీరు మళ్ళీ వెళ్ళి ఆ జి.యమ్.నే కలవండీ!" పిట్టన్నతో నిర్మొహమాటంగా అన్నాడు.

అతని మాట తీరుకు మనస్సు చివుక్కుమంటుంటే వస్తున్న కోపాన్ని దిగమింగుకున్న పిట్టన్న అతను చెప్పినట్టే తిరిగి జి.యమ్.వర్క్స్ ఆఫీస్‌కి వెళ్ళాడు.

అప్పటికే ఫోన్‌లో జి.యమ్. వర్క్స్‌కి కెమికల్ డివిజన్ డి.ఈ.కి గొడవేదో పెద్దగానే జరిగినట్టుంది. అతను పిట్టన్నను చూస్తూనే "చూడండి! ఈ వ్యవహారాలన్నీ చూడాల్సిన జి.యమ్. పర్సనల్, మ్యాటర్ని మెల్లగా నా మీదకు తోసి డ్రామా చూస్తున్నాడు. మీరేమో వచ్చి నా పీకల మీద కూర్చుంటున్నారు. ఎవ్వడూ వద్దంటుంటే నేనేం చెయ్యాలి?" అన్నాడు కోపంగా.

బదులు మాట్లాడకుండా అరగంట పాటు అక్కడే కూర్చున్నాడు పిట్టన్న. ఆఖరికి పిట్టన్నను మళ్ళీ తన చాంబర్‌లోకి పిలిపించుకున్న జి.యమ్. వర్క్స్ "ఒక పని చేస్తారా?" అన్నాడు. "చెప్పండేంటో?" అన్నట్టు చూశాడు పిట్టన్న.

"కంపెనీలో వుండే అన్ని యూనియన్ల నాయకుల దగ్గరికి వెళ్ళి మిమ్మల్ని ఆఫీస్ సైడ్‌కి పంపిస్తే వాళ్ళకేమీ అభ్యంతరం లేదన్నట్టు ఒక లెటర్ రాయించుకు రండి. అప్పుడిక మిమ్మల్ని ఎటు మార్చినా అడిగేవాడుండడు." అంటూ సాధ్యంకాని సలహాను ఇచ్చాడు జి.యమ్.వర్క్స్.

¤ ¤ ¤

"ఇదీ జరిగిన సంగతి. నాకు న్యాయం జరగాలంటే రోడ్డెక్కక తప్పని పరిస్థితి కల్పించారు." అంటూ తన చుట్టూ చేరినవాళ్ళకు అప్పటిదాకా జరిగిన ప్రతి విషయాన్నీ పూసగుచ్చినట్టు వివరించాడు పిట్టన్న. ఆ తరువాత మరో గంటకు

"పాల్వంచ ఫెర్టిలైజర్స్ కంపెనీలో అంగవైకల్యంతో బాధపడుతున్న గిరిజన కార్మికుడికి తగిన పోస్టింగ్ ఇవ్వకుండా ఏడిపిస్తున్న అధికారగణం. కొమరం భీమ్ విగ్రహం సాక్షిగా కంపెనీ గేట్ ముందు గిరిజనుల ఆందోళన." అన్న బ్రేకింగ్ న్యూస్ అన్ని చానల్స్‌లోనూ వచ్చింది.

అంతే!

ఇతర యూనియన్ల నాయకులంతా ఎక్కడివాళ్ళక్కడే గప్‌చుప్ అయిపోయారు.

అధికార గణం ఆగమేఘాల మీద కదిలింది.

✦



బఠాణీ మష్రూమ్స్

కావలసిన పదార్థాలు

పచ్చిబఠాణీలు–ఒకటిన్నర కప్పు, పుట్టగొడుగులు–200 గ్రాములు, ఉల్లిపాయలు–రెండు, టొమాటోలు–నాలుగు, కారం–టేబుల్ స్పూను, ధనియాల పొడి–టేబుల్ స్పూను, పసుపు–టీ స్పూను, గరం మసాలా–టీ స్పూను, జీడిపప్పు ముద్ద–అర కప్పు, యాలకులు–నాలుగు, దాల్చిన చెక్క–అంగుళం ముక్క, అల్లం వెల్లుల్లి–2 టేబుల్ స్పూన్లు, నూనె–4 టేబుల్ స్పూన్లు, ఉప్పు– రుచికి సరిపడా.

తయారు చేయు విధానం

పుట్టగొడుగుల్ని కడిగి ముక్కలుగా కోయాలి. బాణలిలో నూనె వేసి యాలకులు, దాల్చిన చెక్క, ఉల్లి ముక్కలు వేసి వేయించాలి. తరువాత అల్లం వెల్లుల్లి వేసి ఓ నిమిషం వేయించాలి. టొమాటో ముక్కలు కూడా వేసి ఉడికించాలి. తరువాత కారం, ధనియాల పొడి, పసుపు, గరం మసాలా, ఉప్పు వేసి ఓ రెండు నిమిషాలు ఉడికించాలి. జీడిపప్పు ముద్దని ఓ కప్పు నీళ్లలో కలిపి బాణలిలో పోయాలి. తరువాత మరో కప్పు నీళ్ళు పోసి మరిగించాలి. ఇప్పుడు బఠాణీలు, పుట్టగొడుగులు వేసి ఉడికిన తరువాత దించాలి.

చిల్లీ మష్రూమ్

కావలసిన పదార్థాలు

బటన్ మష్రూమ్స్–200 గ్రా, క్యాప్సికమ్–రెండు, ఉల్లిపాయ –ఒకటి, అల్లం–అంగుళం ముక్క, వెల్లుల్లి–6 రెబ్బలు, నూనె–2 టేబుల్ స్పూన్లు, కారం– టీ స్పూను, సోయాసాస్–2 టీ స్పూన్లు, కార్న్‌ఫ్లోర్–టేబుల్ స్పూను, వినెగర్–టీ స్పూను, మంచి నీళ్ళు–కప్పు, ఉప్పు– రుచికి సరిపడా.

తయారు చేయు విధానం

పుట్టగొడుగుల్ని రెండు ముక్కలుగా కోయాలి. క్యాప్సికమ్ లోపల గింజలు తీసేసి ముక్కలుగా కోయాలి. ఉల్లి ముక్కలు, అల్లం, వెల్లుల్లి కలిపి మెత్తని ముద్దలా రుబ్బాలి. బాణలిలో 4 టేబుల్ స్పూన్ల నూనె వేసి ఉల్లిముద్ద వేసి బాగా వేయించాలి. తరువాత కారంవేసి, అరకప్పు నీళ్ళు పోసి సిమ్‌లో పెట్టి ఉడికించాలి. ఇప్పుడు క్యాప్సికమ్ ముక్కలు, పుట్టగొడుగుల ముక్కలు, ఉప్పు వేసి కలిపి మూత పెట్టి తక్కువ మంట మీద ముక్కలు ఉడికేవరకూ ఉంచాలి. తరువాత సోయా సాస్, వినెగర్ వేసి కలపాలి. కాసిని నీళ్లలో కలిపిన కార్న్‌ఫ్లోర్ కూడా వేసి కలిపి సిమ్‌లో ఓ రెండు నిమిషాలు ఉడికించి దించాలి.

మది దోచే మష్రూమ్స్

ఆంధ్రా మష్రూమ్ కర్రీ

కావలసిన పదార్థాలు

పుట్ట గొడుగులు– పావు కిలో, ఉల్లిపాయలు– మూడు, పచ్చిమిర్చి–మూడు, కారం–టీ స్పూను, పసుపు–పావు టీ స్పూను, కొత్తిమీర–కట్ట, నూనె–వేయించడానికి సరిపడా, ఉప్పు– తగినంత.

మసాలా ముద్ద కోసం

అల్లం తురుము– టీ స్పూను, వెల్లుల్లి–రెండు రెబ్బలు, జీలకర్ర– టీ స్పూను, గసగసాలు–టీ స్పూను, ధనితయాలు–టీ స్పూను

తయారు చేయు విధానం

పుట్టగొడుగుల్ని కడిగి ముక్కలుగా కోయాలి. ఉల్లిపాయలు, పచ్చిమిర్చి సన్నగా పొడవుగా తరగాలి. మసాలా ముద్ద కోసం తీసుకున్న దినుసులన్నీ ముద్దలా రుబ్బుకోవాలి. బాణలిలో నూనె వేసి ఉల్లిముక్కలు పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. తరువాత ఉప్పు వేసి ఐదు నిమిషాలు వేయించాలి. ఇప్పుడు కప్పు నీళ్ల పోసి మీడియం మంట మీద రెండు నిమిషాలు ఉడికించాలి. ముక్కలు బాగా ఉడికిన తరువాత మసాలా ముద్ద వేసి ఐదు నిమిషాలు ఉడికించాలి దించి కొత్తిమీర చల్లితే సరి.

చెట్టినాడ్ మష్రూమ్ కర్రీ

కావలసిన పదార్థాలు

మష్రూమ్స్ ముక్కలు–2 కప్పులు, చింతపండు–నిమ్మకాయంత (అర కప్పు నీళ్లలో నానబెట్టాలి), ఉప్పు–సరిపడా, గరం మసాలా–టీ స్పూను, సెనగపప్పు–టేబుల్ స్పూను, మిరియాల పొడి–టీ స్పూను, నూనె–2 టీ స్పూన్లు, ఆవాలు–అర టీ స్పూను, ఎండు మిర్చి–2, కరివేపాకు–2 రెమ్మలు.

తయారు చేయు విధానం

చింతపండుని మెత్తగా గుజ్జులా చేయాలి, సెనగపప్పుని విడిగా చిన్న బాణలిలో వేసి వేయించి పొడి చేయాలి. ఈ పొడిలోనే గరం మసాలా, మిరియాల పొడి కలపాలి. స్టవ్ మీద నాన్ స్టిక్ పాన్ పెట్టి నూనె వేసి కాగాక ఆవాలు వేసి వేయించాలి. కరివేపాకు, ఎండు మిర్చి కూడా వేసి వేగాక పుట్టగొడుగుల ముక్కలు వేసి వేయించాలి. ఇప్పుడు ఉప్పు వేసి మూత పెట్టి ఉడికించాలి. ఉడికాక మూత తీసి చింతపండు గుజ్జు వేసి పది నిమిషాలు సిమ్‌లో ఉడికించాలి. చివరగా గరం మసాలా మిశ్రమం వేసి మరో ఐదు నిమిషాలు ఉడికించి ఉప్పు సరి చూసి దించాలి.

చుక్కలు కలపండి

ఏయే జంతువులు ఉన్నాయి

ఈ చిత్రంలో ఓ జీవి వుంది. కాకపోతే అందులో మొత్తం రెండు జంతువుల శరీర భాగాలున్నాయి. వాటిని గుర్తించి చెప్పండి.

దారి చూపండి



ఈ పువ్వు ఎంత అందంగా వుందో కదా. మనలాగే పువ్వు అందం చూసి మకరందం కోసం వచ్చిందీ తేనెటీగ. ఇంతకీ లోపలి నుంచి బైటికెళ్లే మార్గం చెప్పండి చూద్దాం.

పది తేడాలు గుర్తించండి

పిల్లలూ! మీకు అడవి అంటే చాలా ఇష్టం కదా. అడవిలో పులులు, నక్కలు, ఏనుగులు ఇలా చాలా రకాల జంతువులు ఉంటాయి. ఈ చిత్రంలోని పది తేడాలున్నాయి. వాటిని గుర్తిస్తారు కదా?కుదిరితే రంగులూ వేయండి.



జంతువుల అరుపులు గుర్తించండి

ఇక్కడి కొన్ని జంతువులు...ఎదురుగా వాటి అరుపులు వున్నాయి. ఇంతకీ ఏ జంతువు అరుపు ఏదో గుర్తించండి చూద్దాం.



ఒంటె బొమ్మ గీద్దాం

ఇవాళ మీకోసం ఒంటె బొమ్మను ఎలా గీయాలో నేర్పుతాడట ఆర్టిస్టు అంకుల్. కింది బొమ్మల ఆధారంగా ఒంటె బొమ్మను గీస్తారు కదూ?



జెరోబా

మీకు కంగారూలు అంటే చాలా ఇష్టం కదా. రెండు కాళ్ల మీద గెంతుతూ నడుస్తాయి. అందుకే మీకు అవంటే ఇష్టం. వాటిలాగే గెంతే బుల్లి జీవుల్ని చూశారా? ఇదిగో మన అరచేతిలో ఇమిడి పోయే ఈ జీవి పేరు జెరొబా. ఇవి ఎక్కువగా ఎడారి ప్రాంతాలు, కొండ ప్రాంతాల్లో నివసిస్తాయి. మనం గమనించలేనంత వేగంగా ఇవి బొరియల్లోకి వెళ్లి దాక్కుంటాయి. ఇవి చాలా తెలివైనవి. కొన్ని జెరొబాల చెవులు చాలా బారుంటాయి. ఇవి కొన్ని గ్రాముల బరువు మాత్రమే తూగుతాయి. వాటి గురించి మరిన్ని వివరాలు..

- ఉత్తర ఆఫ్రికా, ఆసియాలలో ఎక్కువగా జీవిస్తాయి. పాకిస్తాన్, అఫ్ఘానిస్తాన్, చైనా, మంచూరియాల్లో కనిపిస్తాయి.
- కంగారూల్లా రెండు కాళ్లతో గెంతుతూ పరుగెడతాయి. పిడికెడంత కూడా లేని ఈ జీవులు గంటకు 24 కిలోమీటర్ల వేగంతో పరుగెట్టగలవు.
- వాటి తోక శరీరానికన్నా పొడుగ్గా ఉంటూ శరీరాన్ని రెండు కాళ్ల మీద బ్యాలెన్స్ చేసేందుకు ఉపయోగపడుతుంది.
- శత్రువుకు చిక్కకుండా జిగ్‌జాగ్ (రంపపు పళ్ల) వరసలో కదులుతాయి.
- కొన్ని అడుగుల దూరం వరకు గెంతగలవు.
- ఆరేళ్ల పాటు జీవించే ఈ జీవుల ప్రధాన శత్రువు గుడ్లగూబ.
- రాత్రుళ్లు బొరియల్లోంచి వచ్చి ఆహారం కోసం వెతుకుతాయి.
- ఎక్కువగా మొక్కల్ని తినే ఇవి వాటికి ఎదురైన కీటకాల్ని లాగిస్తాయి.
- ఆహారం ద్వారానే శరీరానికి కావాల్సిన నీటిని తీసుకుంటాయి.
- విత్తనాలను తినవు. ఆహారాన్ని నిల్వ చేసుకోవు.
- చురుకైనా వినికిడి శక్తి వీటికి ఉంటుంది.
- ఎడారి ఇసుక రంగును పోలి వాటి శరీర ఛాయ ఉంటుంది.
- అవి ఒంటరిగానే జీవిస్తూ, అవి ఉండేందుకు నాలుగు రకాల బొరియల్ని తయారు చేసుకుంటాయి.
- రాత్రుళ్లు ఆహార వేటకు, ఎండ నుంచి తలదాచుకునేందుకు తాత్కాలికంగా రెండు. వేసవి, చలికాలాల్లో ఉండేందుకు రెండు శాశ్వత బొరియల్ని రూపొందించుకుంటాయి.
- శత్రువులకు చిక్కకుండా తప్పించుకుపోయేలా బొరియల నిర్మాణం ఉంటుంది.
- డస్ట్ బేతింగ్ (దుమ్ము స్నానం) ద్వారా అవి సంకేతాల్ని అందించుకుంటాయి. చిన్న చిన్న శబ్దాలను సృష్టించి మాట్లాడుకుంటాయి.
- 33 రకాలున్న వీటిలో పిగ్మీ జెరోబా చిత్రమున్న రష్యన్ స్టాంప్‌ను 1985లో విడుదల చేశారు.
- రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ జెరోబాను తమ యుద్ధ మస్కట్‌గా ఉపయోగించింది.
- మంకీ ఫాక్స్ సంక్రమింపజేస్తాయనే కారణంతో వీటిని పెంచుకునేందుకు, దేశంలోకి తీసుకొచ్చేందుకు అమెరికా అనుమతి ఇవ్వదు.

✦

లోహ కథలతో మెదడుకు పదును

ఇది చాలా విలువైన, అరుదైన పుస్తకం. వెనెట్ స్కీ రష్యాలో ప్రముఖ పరిశోధకుడు. సైన్స్ రచయిత. ఆయన లోహాలు, మూలకాల గురించి వివరించిన రెండు పుస్తకాలు ప్రపంచమంతటా పేరు పొందాయి. పలు భాషల్లో అవి అనువదింపబడ్డాయి. రసాయనాల చరిత్రలోకి తొంగి చూస్తే ఆసక్తికరమైన ఎన్నో విశేషాలు కనబడతాయి. అలాగే చరిత్రకు సంబంధించిన అంశాలూ ఉన్నాయి. ఇనుము పుట్టు పుర్వోత్తరాల దగ్గర నుండి నేటి పరిస్థితుల దాకా ఇందులో చర్చించబడ్డాయి. 1714-1783 మధ్య రసాయన పరిశోధనలు- ఇనుము-రాగి భారతదేశంలో తుప్పును అదుపుచేసే పద్ధతి- కోబాల్ట్ పెయింటింగ్, బంగారం రాగి వాడకం- మొదలైన అంశాల గురించి విషయ వివరణ పాఠకుల్ని బాగా చైతన్య పరుస్తుంది. పాపులర్ సైన్స్ అధ్యయనవాదులకు చక్కటి కరదీపిక ఇది. ఇనుము బంధువు మోలిబ్దినం మెత్తనిది. తగరం- కాంతి ఇస్తుందే కాని కరగని టంగ్‌స్టన్. ప్లాటినం-బంగారం-పాదరసం-సీసం... ఇలా ఒక్కొక్క లోహం చరిత్ర- ప్రత్యేకతలను వెనెట్‌స్కీ ఈ పుస్తకంలో చర్చించి చరిత్రతో చెప్పిన తీరు చాలా బాగుంది. 14వ శతాబ్ది ఆరంభంలో ఫ్రాన్స్ పాలకుడైన 'ఫిలిప్ 4 ద ఫెయిర్'ను కొన్ని చారిత్రికాధారాలు మోసపు నాణాల ఫిలిప్‌గా పేర్కొన్నాయి(పేజీ 186). 1734లో ఇర్‌కుత్ స్కీ ఉప గవర్నర్‌ను చైనా నుండి భారీ మొత్తం వెండిని కొనుగోలు చెయ్యమని ప్రభుత్వం ఆదేశించింది (పేజీ 187). ద్వితీయ ప్రపంచ సంగ్రామం ముందు టాంటలం-నియోబియం-ముడి ఖనిజాలు. సాలీనా వెలికితీత 600-900 టన్నులు మాత్రమే కాగా, 1944లో దాని ఉత్పత్తి చాలా రెట్లు పెరిగింది (పేజీ 210). 1915లో ప్లాటినం మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో 95 శాతం రష్యాదే (పేజీ 229). రెండు వేల మిలియన్ డాలర్ల వ్యయంతో పరమాణు బాంబు తయారీ పూర్తి అయ్యింది. అది 1945 సంవత్సరం ఇనుము, లిథియం, బెరిల్లియం, మెగ్నీషియం, అల్యూమినియం, క్రోమియం, మాంగనీసు, కోబాల్టు, రాగి, నికెల్, టైటానియం, తగరం ఉత్పత్తి తెలిపే వ్యాసాలు పాఠకుల మెదడుకు పదును పెడతాయి.

-ప్రసన్న కుమారి



లోహాలు చెప్పే కథలు,
రచయిత: ఎస్.ఐ వెనెట్ స్కీ,
వెల:రు150/-,
పేజీలు: 288,
ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్ (తెలంగాణ), ఎమ్.హెచ్ భవన్-ప్లాట్ నెం 21/1, ఆజామాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం దగ్గర, హైదరాబాద్-20.
ఫోన్ నెంబరు: 27660013.



ఆధునిక చిత్ర కళారీతులు,
రచన: టి. వెంకట్రావ్,
వెల:రు.100/-,
పేజీలు: 150,
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలు. మరియు గిరి ప్రసాద్ భవన్, బండ్లగూడ-హైదరాబాద్.
ఫోన్: 24224459

చిత్రకారులకు విందు భోజనం

"చిత్రకారులకు విందు భోజనం వడ్డించావు" అంటూ చలసాని ప్రసాదరావు గారిచే ప్రశంసలు. డా॥ సంజీవ్‌దేవ్‌గారి ప్రశంసలు టి.వి పొందారు. 1994లో వెలువడిన వీరి తొలి గ్రంథం "చిత్ర కళా చరిత్ర" ఎంతో ముఖ్యమైనది. దాదాపు 20 భాగాలుగా వెలువడిన వ్యాసాలు సాధారణ పాఠకుల మెదళ్ళకు పదును పెడతాయి. 1840లో జన్మించిన ఫ్రెంచ్ చిత్రకారుడు ఓడిలాన్ రిడాన్ సింబాలిస్టులకు నాయకుడుగా వెలిగాడంటారు. 1863 నుండి 1944 వరకు జీవించిన నార్వే చిత్రకారుడు ఎడ్వర్డ్ మంచ్ కూడా సింబాలిజంలో ఎన్నో ప్రయోగాలు చేశాడు. వాన్‌గో, గాగిన్‌ల వలెనే మంచ్ కూడా భవిష్యతు ఎక్స్‌ప్రెషనిస్టు చిత్రకారులకు స్ఫూర్తి నిచ్చినవాడే- అంటారు. 19 వ శతాబ్దపు ఆఖరి ఉద్యమం సింబాలిజం. 1890 దశకంలో ఇది ఆవిర్భవించింది. సాహిత్యంలోనూ కళల్లోనూ ఈ ధోరణి వ్యాపించింది. అంటారు. ఈ పుస్తకం చిత్ర కళకు ఓ సిలబస్‌లా అనిపిస్తుంది. 1888 నాటి విన్సెంట్ వాంగో, వెస్ లిగ్నిస్ డి ఏర్లెస్, కాండిన్‌స్కీ 'కాంపోజిషన్7' 1913 నాటి చిత్రాల ముద్రణ. అలాగే రియలిస్టుల చిత్రాలు, ఇంప్రెషనిస్టుల చిత్రాలు, పాయింటిల్లిస్టుల చిత్రాలు, పోస్ట్ ఇంప్రెషనిస్టులు సిజాన్ వాన్‌గో, లాట్రిక్‌ల చిత్రాలు, వారి చరిత్ర, సింబాలిస్టుల చిత్రాలు, హెన్రీ మాటిస్ 'ఫావిస్టుల చిత్రాలు', యుద్ధ కాలంలో పుట్టిన ఎక్స్‌ప్రెషనిజమ్ చిత్రాలు.. వ్యాసం, పికాసో కనిపెట్టిన 'క్యూబిజం' -క్యూబిస్టుల చిత్రాలు చలనాన్ని చిత్రించిన ఫ్యూచరిజం, జామెట్రిక్ యాబ్‌స్ట్రాక్ట్ చిత్రాలు, "సుప్రిమాటిజం" శైలి ప్రవేశపెట్టిన రష్యన్ చిత్రకారుడు మాలెవిచ్ 1915, అరాచక చిత్రకళ దాదాయిజం. సిగ్మండ్ ఫ్రాయిడ్ సిద్ధాంతంతో పుట్టిన సర్రియలిజం, సర్రియలిస్టుల చిత్రాలు ... భారతీయ చిత్రకళారీతుల్లోని నియో తాంత్రిక్ చిత్రణ మొదలైన చిత్రకళా అంశాల్ని ... ఎందరో చిత్రకారులను... చిత్రాలతో పరిచయం చేసిన టి.వి గారి కృషి బహు ప్రశంసనీయం, అభినందనీయం.

-తంగిరాల చక్రవర్తి

పచ్చ కొంగు

ద్వీప గ్రామంతో ప్రేమలో పడిందేమో పచ్చ కొంగు కప్పి ప్రకృతి దగ్గరకు తీసుకుంది. గ్రామం మొత్తం పాక్కుంటూ తన ధారాదత్తం చేసుకుంది. చైనా యాంగ్జీ నదిలోని షెంగ్జీ ద్వీప సముదాయంలోని గోక్వీ దీవిలోనిది ఈ గ్రామం. ఒకప్పుడు మత్స్యకారులు అక్కడ నివసించేవారు. తర్వాత ఆ గ్రామాన్ని పూర్తిగా ఖాళీ చేసి ప్రధాన భూభాగాలకు తరలిపోయారు. ఒంటరిగా మిగిలిపోయిన ఆ గ్రామంలోని ఇళ్లు, దారులు, మెట్లు, ఆట స్థలాలన్నింటినీ భద్రపరుస్తున్నట్టు పచ్చ కంచె కట్టాయి లతలు. అవి ఎంత అద్భుతంగా విస్తరించాయంటే ఇంటి గోడల నుంచి, పైకప్పుల నుంచి మెట్ల వరసల మీద అవి అల్లేశాయి. ఈ గ్రామాన్ని స్థానికులు ఖాళీచేసి చాలా కాలమై ఉంటుంది. ఎటు చూసినా పచ్చగా లతలే. కొన్ని రోజుల కిందటి వరకు దీని గురించి ఎవరికీ తెలీదు. ఔత్సాహిక ఫొటోగ్రాఫర్ టాన్నీ యువాంగ్ 400 వందల ద్వీపాలతో యాంగ్జీ నదీ ద్వారా భూలోక స్వర్గంగా విరాజిల్లుతున్న షెంగ్జీ ద్వీపాల అందాల్ని చిత్రిస్తూ ఈ గ్రామాన్ని చేరాడు. ఈ అద్భుతాన్ని చూసి విస్తుపోయాడు. వాటినిలా చిత్రాల్లో బంధించి ప్రపంచానికి పరిచయం చేశాడు. షెంగ్జీ మొత్తం ద్వీపాల్లో కేవలం 18 మాత్రమే నివాస యోగ్యం. సుమారుగా 16 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత ఉండే ఈ ద్వీప ప్రాంతంలో చేపలు విస్తారంగా లభిస్తాయి. ప్రతి చలికాలంలో లక్ష మంది మత్స్యకారులు ఇక్కడ చేపలు పట్టేందుకు వస్తారు. అలా సమీప ద్వీపాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుంటారు. అలాంటి గ్రామమే ఇది. ఇక్కడి పెద్ద ద్వీపం సిజియావో, షాంఘైకి కేవలం 5 గంటల పడవ ప్రయాణ దూరంలోనే ఉంటుంది. పర్యాటకులు భారీ స్థాయిలో విహారానికి వస్తుంటారు. ఇప్పుడీ గ్రామం లేటెస్ట్ టూరిస్ట్ అట్రాక్షన్ అవుతోంది.

●

చిరునవ్వుతో చిరాయువు

ఆమె వయసు 97. మనసు మాత్రం 20. ఈ వయసులోనూ విల్లుకు సైతం మెళకువలు చెప్పగల నేర్పరి. మాజీ నటి, మోడల్. అతి వృద్ధ యోగా శిక్షకురాలిగా ప్రపంచ ప్రసిద్ధురాలు. తనే తావో పోర్చోన్ లించ్. యోగా గురువుగా నేటికీ స్ఫూర్తినిస్తున్న తావో పుట్టింది మన దేశంలోనే. అదీ పాండిచ్చేరిలో. తండ్రి ఫ్రెంచి దేశస్తుడు. తల్లి భారతీయురాలు. అయితే తావోకు జన్మనిచ్చే సమయంలోనే తల్లి చనిపోవడంతో పిన్నమ్మ దగ్గర పెరిగింది. ఎనిమిదేళ్ల వయసులో మొదటిసారిగా బీచ్ ఒడ్డున ఆమెకు యోగా పరిచయమైంది. అదేదో కొత్త రకం ఆట అనుకుందే కానీ యోగా అని తెలియదు. పక్కనే వున్న పిన్ని చెప్పింది అది యోగా అని. కేవలం మగపిల్లలే చేస్తారని. 'మగ పిల్లలు చేసినప్పుడు నేనూ చేయగలను కదా' అనుకుంది చిన్నారి తావో. సాధనలో మునిగితేలి సాధించింది.

కెరీర్ ప్రారంభంలో తావో ముందుగా ఫ్యాషన్ రంగాన్ని ఎంచుకుంది. ప్రపంచవ్యాప్తంగా పర్యటించి అనేక ప్రసిద్ధ కంపెనీలకు పనిచేసింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిశాక అమెరికా చేరి నటనను చేపట్టింది. పలు హాలీవుడ్ చిత్రాల్లో నటించింది. ఖాళీ సమయాలను వృథా పోనిచ్చేది కాదు. తోటి నటీనటులకు తనకెంతో ఇష్టమైన యోగా నేర్పేది. తర్వాత నటనను విడిచిపెట్టి పూర్తిగా యోగా శిక్షకురాలిగా మారింది. మరోవైపు బాల్‌రూమ్ టాంగో నృత్యం పట్ల ఆసక్తి చూపించింది. అలా ఆమె ఎక్కడ పోటీలో పాల్గొన్నా ప్రథమ బహుమతి గెల్చుకుంది. ముద్రణా రంగంలోనూ ఆమెకు ప్రవేశం వుంది. 'ది బీవరేజ్ కమ్యూనికేటర్' పత్రికకు సంపాదకురాలిగా బాధ్యతలు నిర్వహించింది. అమెరికాలో జరిగిన అనేక యోగా పోటీలకు న్యాయమూర్తిగా వ్యవహరించింది. 2012లో ప్రపంచంలోకెల్లా వృద్ధ యోగా టీచర్‌గా గిన్నిస్ రికార్డులకెక్కింది.

మణిపూర్ అధికారిక భాషల్లో ఒకటైన మైథాయ్‌తోపాటుగా ఫ్రెంచి భాష మాట్లాడుతూ పెరిగిన తాయ్ అమెరికా వెళ్లాక ఇంగ్లీషు మాట్లాడ్డంలో కాస్త ఇబ్బందులు ఎదుర్కొన్నా... తర్వాత నేర్చుకుని ఆ సమస్య నుంచి బైటపడింది. పూర్తి శాకాహారి. ఎత్తు మడమల చెప్పలంటే చాలా ఇష్టం. విరామ సమయాల్లో ప్రాణాయామం చేస్తుంది. కారును సొంతగా నడపడానికి ఆసక్తి చూపుతుంది. ఉదయాన్నే నిద్ర లేచినప్పుడు జరగబోయేది మంచా చెడా అనేది ఆమె పెద్దగా ఆలోచించదు. జీవితంలో ఇది మంచి రోజు అని తనకు తాను చెప్పకుంటుంది. ఆమెకు వయసు కేవలం అంకె మాత్రమే. ఎవ్వరూ చూడట్లేదనుకొని మనసారా డాన్స్ చేయడమంటే తావోకి ఎంతో ఇష్టం. అలా తనలో తిరిగి ఉత్సాహాన్ని నింపుకుంటుంది. ఎల్లవేళలా పాజిటివ్‌గా వుండేందుకు, చిరునవ్వులు చిందించేందుకే ప్రయత్నిస్తుంది. బహుశా ఇవేనేమో తావో ఆరోగ్య రహస్యాలు. ●